ప్రజాగళం... పోటెత్తిన జనం

బజారు వీధిలో..

శ్రీకాళహస్తి పట్టణం నగరి వీధిలో...



మధుకు ఓటేస్తే మీ ఇళ్లు కూడా మిగల్చడు

"శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డికి మళ్లీ ఓటేస్తే మీ ఇళ్ళూ భూములూ మిగలవు. నేను తెచ్చిన పరిశ్రమలను ఆయన ఏటీఎంగా మార్చుకుంటున్నాడు. ల్యాంకోను వేధించి కప్పం కట్టలేదని పదిహేను రోజులు మూతబడేలా చేశాడు. మధుసూదనరెడ్డి లాంటి దుర్మార్గుడ్ని నేనెక్కడా చూడలేదు. కమీషన్లు, కబ్జాలు, రౌడీయిజం, గూండాయిజం, శాండ్ మాఫియా,ల్యాండ్ మాఫియాలకు శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని అడ్డాగా మార్చేశాడు. 210 ఎకరాల ప్రభుత్వ భూములు కాజేశాడు. ఎమ్మెల్యే కుటుంబంలో కూతురు, బావమరిది, కొడుకు, తమ్ముడు నియోజకవర్గాన్ని ముక్కలు చేసుకుని వాటాలు వేసుకుని పంచుకు తింటున్నారు. రాజీవ్‌నగర్‌లో పేదల ఇళ్ళ స్థలాలను ఎమ్మెల్యే అనుచరులతో కబ్జా చేయించాడు. శ్రీకాళహస్తిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎదురుగా రూ. కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాజేశాడు. చివరికి శ్రీకాళహస్తి డంపింగ్ యార్డునూ కబ్జా చేశారు. బోగస్ పట్టాలతో అందరినీ ప్రలోభ పెడుతున్నాడు. దానిపై విచారణ జరిపించి బాధ్యులను జైలుకు పంపుతాం. అవినీతికి పాల్పడిన వారికి బేడీలు వేసి ఊరేగిస్తాం. అహంకారి, విధ్వంసపరుడు, దుర్మార్గుడైన ఎమ్మెల్యే మధుసూదనరెడ్డిని చిత్తుచిత్తుగా ఓడించండి."



జనసేన నేత వినుత, బీజేపీ నేత కోలా ఆనంద్, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు బొజ్జల సుధీర్‌రెడ్డి, వరప్రసాద్‌తో కలిసి సంఘీభావం తెలుపుతున్న చంద్రబాబు

పెద్దిరెడ్డి బినామీ కిలివేటి

"సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మంత్రి పెద్దిరెడ్డికి బినామీగా వ్యవహరిస్తున్నాడు. స్వర్ణముఖి, కాళంగి నదుల్లో ఇసుక తవ్వకాలకు ఎమ్మెల్యేని పెద్దిరెడ్డి పావుగా వాడుకుంటున్నాడు. సూళ్ళూరుపేట నియోజకవర్గాన్ని గంజాయి, లిక్కర్, బెట్టింగ్, గ్రావెల్, రేషన్ బియ్యం అక్రమ దందాలకు కేరాఫ్‌గా మార్చేశారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినా కనీసం తట్ట మట్టి కూడా పోయలేదు. ఏమి చేశారని ప్రజలు మూడోసారి ఓట్లు వేస్తారు?"

"ఎస్సీ, మైనారిటీ ఎమ్మెల్యేలకు టికెట్లు మార్చిన జగన్, తన సామాజికవర్గానికి చెందిన పెద్దిరెడ్డికి ఎందుకు మార్చలేదు? చెవిరెడ్డికి ఎంపీ టికెట్, కొడుక్కు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చి డబుల్ ప్రమోషన్ మాత్రం ఎలా ఇచ్చాడు?"

"సీఎంగా వున్నపుడు ఎర్ర చందనం అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపా. ఇపుడు వైసీపీలో ఏకంగా ఎర్రచందనం స్మగ్లర్‌కు చిత్తూరు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు."

తిరుపతి, శ్రీకాళహస్తి, నెల్లూరులను కలుపుతూ

ట్రై సిటీ

- పర్యాటక హబ్‌గా కాణిపాకం, తిరుపతి, శ్రీకాళహస్తి
- శ్రీకాళహస్తి, నాయుడుపేట సభల్లో చంద్రబాబు ప్రకటన
- భారీ జనసందోహాన్ని ఉద్దేశించి ఉద్వేగంగా ప్రసంగాలు
- వైసీపీ ఎమ్మెల్యేల అవినీతి చిట్టా విప్పి హెచ్చరికలు

ప్రజాగళం సభలకు అంచనాలకు మించి పార్టీ శ్రేణులు, ప్రజలు హాజరవడంతో టీడీపీ అధినేత చంద్రబాబే సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. నాయుడుపేట సభ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కావాల్సి వుండగా సూళ్ళూరుపేట నియోజకవర్గవ్యాప్తంగా కార్యకర్తలు, నాయకులు, సామాన్య జనం ఉదయానికే నాయుడుపేటకు చేరుకున్నారు.ఎండ, వేడిమి కారణంగా ఎక్కడ నీడ, చాటు దొరికితే అక్కడల్లా తలదాచుకుని అధినేత రాక కోసం ఓపికగా నిరీక్షించారు. మధ్యాహ్నం ఎండ మండిపోతున్నా లెక్క చేయకుండా బహిరంగ సభలో పాల్గొని చంద్రబాబు ప్రసంగానికి జేజేలు కొట్టారు. అక్కడ నియోజకవర్గ నేతలు వేసుకున్న అంచనాలకు మించి జనం హాజరయ్యారు. ఇక శ్రీకాళహస్తిలో సాయంత్రం 5 గంటలకు సభ ప్రారంభమవుతుందని తెలిసినా పార్టీ శ్రేణులు, ప్రజలు మధ్యాహ్నం నుంచే బేరివారి మండపం కూడలి ప్రాంతానికి చేరుకున్నారు. హెలిపాడ్ వద్ద కూడా చంద్రబాబుకు భారీ స్వాగతం పలికారు. చంద్రబాబు ఆగమనానికి సూచికగా భారీ ఎత్తున బాణాసంచా పేల్చడంతో స్థానికులు పెద్ద సంఖ్యలో సభా కూడలి వద్దకు పరుగులు పెట్టారు. శ్రీకాళహస్తిలో అయితే పార్టీ నేతలు వేసుకున్న అంచనాలకు కొన్ని రెట్లు అధికంగా జనం విరగబడడంతో చంద్రబాబు సైతం సంతోషం పట్టలేకపోయారు. తన ప్రసంగంలో ప్రత్యేకంగా ఈ అంశాన్ని ప్రస్తావించారు. శ్రీకాళహస్తిలో ఇంత జనం హాజరైన సభను చూడలేదన్నారు. ఎంతో సంతోషంతో, మనస్తృప్తితో వెళుతున్నానని ఆయన చెప్పడమే సభ ఎంతగా విజయవంతమైంది అనడానికి నిదర్శనం. దానికి తోడు చంద్రబాబు ప్రసంగానికి జనం నుంచీ అనూహ్య స్పందన కనిపించింది. స్థానిక ఎమ్మెల్యేపై ఆరోపణలు చేసినపుడు, అవినీతిపరులను బేడీలు వేసి ఊరేగిస్తామని హెచ్చరికలు చేసినపుడు జనం కేరింతలు కొట్టారు. మొత్తానికి రెండు చోట్లా చంద్రబాబు పాల్గొన్న బహిరంగసభలు విజయవంతం కావడంతో స్థానిక పార్టీ నాయకుల సంతోషానికి పట్టపగ్గాల్లేకుండా పోయాయి.

శ్రీకాళహస్తి/నాయుడుపేట, మార్చి 30: తిరుపతి, శ్రీకాళహస్తి, నెల్లూరులను కలుపుతూ ట్రైసిటీగా అభివృద్ధి చేయాలన్నది తన కల అని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. శనివారం నాయుడుపేట, శ్రీకాళహస్తి పట్టణాల్లో జరిగిన ప్రజాగళం సభల్లో తిరుపతి జిల్లా అభివృద్ధికి తాను చేయదలచుకున్న అనేక అంశాలను ప్రజలకు తెలియజేశారు. టీడీపీ పాలనలో తాను చేసిన అభివృద్ధి పనులనూ, తరువాత జగన్ చేసిన విధ్వంసాన్నీ వివరించారు. వెల్లువెత్తినట్టుగా హాజరైన ప్రజలను చూసి చంద్రబాబు ఉత్సాహంగా ఉద్వేగంగా ప్రసంగించారు. సీఎం జగన్ మొదలుకుని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట ఎమ్మెల్యేలపై ఆరోపణలు, హెచ్చరికలతో చంద్రబాబు రౌద్రావతారం దాల్చారు.

తిరుపతి కేంద్రంగా పిలిగ్రిమ్ హబ్

కాణిపాకం, తిరుపతి, శ్రీకాళహస్తిలను కలుపుతూ పిలిగ్రిమ్ హబ్‌గా మారుస్తానని చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వంలో తాను జిల్లాలో రూ. వందల కోట్లు ఖర్చు చేసి ఇరిగేషన్ ప్రాజెక్టులు అభివృద్ధి చేశానని, అయితే తర్వాత అధికారంలోకి వచ్చిన సైకో జగన్ పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. సోమశిల-స్వర్ణముఖి కెనాల్, గాలేరు నగరి పనులు తాము ప్రారంభించామని, జగన్ పూర్తిగా గాలికొదిలేశాడన్నారు. తాము అధికారంలోకి రాగానే ఎస్ఎస్ కెనాల్ పనులు పూర్తిచేసి శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని అన్ని చెరువులకూ నీటిని అందించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు.

మత్స్యకారులకు డీజల్, వలలు

టీడీపీ అధికారంలోకి రాగానే మత్స్యకారులను ఆదుకుంటామని నాయుడుపేట బహిరంగసభలో చంద్రబాబు హామీ ఇచ్చారు. పులికాట్ సరస్సులో పూడిక పేరుకుపోవడం, తమిళనాడు జాలర్లతో సరిహద్దు తగాదాలు వంటి సమస్యలు సుదీర్ఘకాలంగా వున్నాయన్నారు. అధికారంలోకి రాగానే వీటికి శాశ్వత పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. సబ్సిడీపై డీజిల్, వలలు ఇస్తామన్నారు. సూళ్ళూరుపేట ప్రాంతంలో వుండేవారు తమిళనాడు సరిహద్దులకు వెళ్ళి పెట్రోలు, డీజిల్ కొనుగోలు చేస్తున్నారని, దీని వల్ల ఆదాయం తమిళనాడుకు పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు.టీడీపీ ప్రభుత్వం ఏర్పడగానే ఈ ప్రాంతానికి పెట్టుబడులు రప్పించి, స్థానిక యువతకు ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానన్నారు.

ఉన్న పరిశ్రమలూ తరిమేశారు

తాను తిరుపతి విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా తెచ్చానని, ఈ ప్రాంతానికి హీరో మోటర్స్, సెల్‌కాన్, ఈసీఎల్, కార్బన్, డిక్సన్ కంపెనీలు తీసుకొచ్చి పారిశ్రామిక హబ్‌గా మార్చానని చంద్రబాబు చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్న వాటినీ తరిమేస్తున్నారని ఆరోపించారు. రిలయన్స్ సంస్థ పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోగా, అమరరాజా పరిశ్రమ విస్తరణ ప్లాంటును తెలంగాణకు తరలించడాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

గోపాల్ జ్ఞాపకాలు..

నిజాయితీతో కూడిన రాజకీయాలకు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి నిలువెత్తు నిదర్శనమని చంద్రబాబు కొనియాడారు. తనకూ గోపాలకృష్ణారెడ్డికి 40 ఏళ్ళ స్నేహం వుందన్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు తామిద్దరూ కలసి వెళుతుంటే అలిపిరి వద్ద తీవ్రవాదులు క్లైమోర్ మైన్స్ పేల్చిన ఘటనను ఆయన గుర్తు చేసుకున్నారు. అప్పట్లో తమ అవసరం ప్రజలకు వుందని భావించడం వల్లే వెంకటేశ్వరస్వామి తమను కాపాడాడన్నారు. శ్రీకాళహస్తి ప్రజల గుండెల్లో గోపాలకృష్ణారెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు.

శివ శివా..

రేణిగుంట పూర్వ తహసీల్దారు శివప్రసాద్‌పై ఫిర్యాదులెన్నో

- ప్రభుత్వ భూముల పరాధీనం
- తీవ్ర అవినీతి ఆరోపణలు
- ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్ తనిఖీలు

తిరుపతి, ఆంధ్రజ్యోతి / రేణిగుంట: తిరుపతి, శ్రీకాళహస్తి పరిసరాల్లో అత్యంత విలువైన ప్రభుత్వ భూములు పరాధీనం చేయడం.. తీవ్ర అవినీతి ఆరోపణల నేపథ్యంలోనే రేణిగుంట పూర్వ తహసీల్దారు శివప్రసాద్‌పై ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్ దృష్టి సారించింది. ఇన్నాళ్లు ఏసీబీకి ఫిర్యాదులు వెళ్లినా.. ఓ అధికారితో ఇతడికి ఉన్న దోస్తీ కారణంగా బుట్టదాఖలా అవుతున్నాయని సమాచారం. దీంతో బాధితులు నేరుగా ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయడం వల్లే శనివారం ఆ అధికారితో పాటు బంధువులు, బినామీల ఇళ్లల్లో ఏకకాలంలో తొమ్మిది చోట్ల ఏసీబీ సీఐయూ బృందాలు తనిఖీలు చేపట్టాయి.

తండ్రి మరణంతో కారుణ్య నియామకం కింద జూనియర్ అసిస్టెంట్‌గా చేరిన శివప్రసాద్.. స్వల్ప కాలంలోనే రూ.కోట్లకు పడగలెత్తారని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. ఆర్ఐగా పదోన్నతిపై తిరుపతి ఆర్డీవో కార్యాలయానికి బదిలీపై వచ్చిన ఆయన.. ఓ ఆర్డీవో సహకారంతో ప్రొటోకాల్ డీటీగా వ్యవహరించారని తెలిసింది. ఆ సమయంలోనే ఉన్నత స్థాయి వ్యక్తులతో పరిచయాలు పెంచుకున్నట్లు సమాచారం. ఆ తర్వాత తిరుపతి రూరల్ తహసీల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా, అర్బన్ తహసీల్దారు కార్యాలయంలో ప్రొటోకాల్ డీటీగా పనిచేశారు. ఆయా సందర్భాలలో ఉన్నతాధికారులతో పెరిగిన పరిచయాలతో రేణిగుంట డీటీగా బదిలీ అయి.. అక్కడే పాతుకుపోయారు. అక్కడ తహసీల్దారును డమ్మీని చేసి డీటీగా ఉన్న శివప్రసాదే అధికారం చెలాయించారన్న విమర్శలున్నాయి. విమానాశ్రయం ఆనుకుని ఉన్న పాతిక ఎకరాల ప్రభుత్వ భూమికి వైసీపీకి చెందిన ముఖ్య ప్రజాప్రతినిధి అండతో ఇతరుల పేరిట పట్టాలు జారీ చేశారని.. దానికోసం ఎకరాకు రూ.20 లక్షల నుంచీ రూ.30 లక్షల దాకా వసూలు చేసినట్టు ఆరోపణలున్నాయి. ఆ తర్వాత తహసీల్దారుగా పదోన్నతి రావడంతో రేణిగుంటలోనే కొనసాగారు. ఆ సమయంలో రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ బంజరు, పొరంబోకు, అనాధీనం భూములను అనర్హులకు కట్టబెట్టడం, అధికార పార్టీ ముఖ్యనేత కబ్జాలకు సహకరించారన్న ఆరోపణలున్నాయి. తిరుపతి రూరల్, అర్బన్, రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో చెరువులు, కాలువలకు కూడా ఎన్‌వోసీలు జారీ కావడం.. ప్రభుత్వ భూముల పరాధీనం, భూముల సెటిల్‌మెంట్లతో అక్రమార్జన వందల కోట్లకు చేరుకుందని సహోద్యోగులే చెబుతున్నారు.

కలెక్టర్‌కు సరెండర్ చేసినా..!

గతంలో ఇతడిపై వచ్చిన ఆరోపణలపై ఓ కలెక్టర్ విచారణ జరిపించి 40 అంశాలను నిర్ధారిస్తూ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారని సమాచారం. ఇటీవల సీసీఎల్ఏ కూడా పలు అంశాల్లో ఇతడిని బాధ్యుడిగా గుర్తించి రేణిగుంట నుంచి కలెక్టర్‌కు సరెండర్ చేసిన సంగతి తెలిసిందే. తీవ్రస్థాయి రాజకీయ ఒత్తిళ్లతో ఇతడిని కలెక్టరేట్‌లో కాకుండా ఏర్పేడు మండలానికి బదిలీ చేశారు. అక్రమార్జన.. నేతల అండ చూసుకుని కలెక్టర్లను కూడా ఖాతరు చేసేవారు కాదన్న ప్రచారం ఉంది. ప్రభుత్వానికి ఎన్ని నివేదికలు ఇచ్చినా, చర్యలకు సిఫారసు చేసినా డబ్బు, పలుకుబడితో అధిగమించేవారని చెబుతున్నారు. గతంలోనూ ఏసీబీకి పలు ఫిర్యాదులు వెళ్లినా.. ఓ అధికారితో స్నేహం వల్ల తనిఖీలు, దాడులు జరగుకకుండా జాగ్రత్త వహించేవారని అంటున్నారు. సంబంధిత ఏసీబీ అధికారితో కలసి బెంగళూరు వంటి నగరాల్లో భారీ పెట్టుబడులు కూడా పెట్టినట్టు ఆరోపణలున్నాయి.

రంగంలోకి ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్

తాజాగా శివప్రసాద్‌పై రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు రావడంతో ఏసీబీకి కాకుండా ఆ విభాగంలోని సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్‌కు విచారణ బాధ్యతలు అప్పగించినట్టు తెలిసింది. విజయవాడ నుంచే మొత్తం 42 మందితో కూడిన బృందాలు ఏకకాలంలో దాడులు జరిగాయి. కాగా, తనకు స్నేహమున్న ఏసీబీ అధికారి సూచన మేరకు మొత్తం అక్రమార్జనంతా బినామీల పేరిట పెట్టినట్టు చెబుతున్నారు. ఇప్పటికే గుర్తించిన పలువురు బినామీల బ్యాంకు ఖాతాలు, లాకర్లను తనిఖీ చేయనున్నట్టు సమాచారం. ఇంతకాలం అధికార పార్టీకి చెందిన ముఖ్య నేతలు ఇతడిని వెనకేసుకొచ్చి, అన్నింటికీ అండదండలిచ్చిన క్రమంలో ఈ దాడులు అందరినీ విస్మయానికి గురి చేస్తున్నాయి. బహుశా, శ్రీకాళహస్తి ప్రాంతానికి చెందిన నేతకు తెలియకుండా విలువైన భూముల విషయంలో ఎవరికైనా సహకరించి భారీగా లబ్ధి పొంది ఉంటారని, ఉంటారని, అది ఆలస్యంగా తెలియడం వల్లే ఆ నేతే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఈ చర్యలకు కారకులై ఉంటారన్న ప్రచారం జరుగుతోంది. గతంలో పలువురు అధికారులను వేధించిన చరిత్ర ఆ నేతకు ఉండటంతో దీన్ని కొట్టిపారేయలేమంటున్నారు. కారణాలేవైనా ఎప్పుడో జరగాల్సిన ఏసీబీ తనిఖీలు, చర్యలు ఆలస్యంగానైనా మొదలు కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బంగారుపాళ్యంలో ఏసీబీ తనిఖీలు



బంగారుపాళ్యం మండలం గుర్రంకొండ్లవూరులోని తహసీల్దారు శివప్రసాద్ మామ నాగులయ్య ఇంట్లో శనివారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. పలు రికార్డులు, బ్యాంకు పుస్తకాలు, భూ రికార్డులను పరిశీలించారు. బ్యాంకు పుస్తకాన్ని తీసుకెళ్లినట్లు సమాచారం. - బంగారుపాళ్యం

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆదివారం) : సా. 6.27
సహరి (సోమవారం) : ఉ. 4.50

టీడీపీతోనే యువతకు భవిష్యత్తు



చంద్రగిరి, మార్చి 30: మండలంలోని ఎ.రంగంపేట పంచాయతీలో శనివారం 'మీ ఇంటికి మీ పులివర్తి నాని' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ యువనేత పులివర్తి వినీల్ ఇంటింటా తిరిగి తన తండ్రి పులివర్తి నానీకి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే యువతకు మంచి భవిష్యత్తు, భరోసా కల్పిస్తారని తెలిపారు. టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్, సింగు సుధ, బెల్లంకొండ రమేష్‌రాయల్, పచ్చిపాల కిషోర్, దేవిలాల్, గుడిమల్లం చెంగల్రాయాచారి, గోపాల్‌రెడ్డి, మబ్బు జ్ఞానశేఖర్, చిత్తూరు పార్థసారధియాదవ్, మునీంద్రయాదవ్, తుఖారామ్, సుధాకర్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, సురేష్‌యాదవ్, భూలక్ష్మి, పళణి, తోకల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమాన్ని పార్టీలు గుర్తుంచుకోవాలి

చంద్రగిరి, మార్చి 30: రాజకీయ పార్టీలు దివ్యాంగుల సంక్షేమం గుర్తుంచుకోవాలని మునీశ్వరస్వామి డిజేబుల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మణికంఠ కోరారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో దివ్యాంగుల కోసం అనేక సంక్షేమ పథకాలను అందించేవారని గుర్తుచేశారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న

చంద్రగిరి, మార్చి 30: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



చంద్రగిరి, మార్చి 30: చంద్రగిరి మండలం పనపాకం రైల్వేస్టేషన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సుమారు 30 ఏళ్ల వయసు గల వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... ఈ నెల 26వ తేదీ రాత్రి పనపాకం వద్ద జాతీయ రహదారిలో గుర్తుతెలియని వ్యక్తి గాయాలతో ఉన్నాడన్న సమాచారంతో పోలీసులు వెళ్లి రుయా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. అయితే మృతుడు ద్విచక్ర వాహనంపై వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని ఉంటుందని భావిస్తున్నారు. అయితే ద్విచక్ర వాహనంపై నెంబర్ ప్లేట్ లేకపోవడంతో మృతుడు ఆచూకీ తెలియలేదని తెలిపారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు



భాకరాపేట, మార్చి 30: చిన్నగొట్టిగల్లు మండలం టేకులగుంట హరిజనవాడ, చెరువుముందరపల్లెకు చెందిన పలువురు వైసీపీ నాయకులు శనివారం చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో టీడీపీలో చేరారు. టేకులగుంటకు చెందిన కాకి వెంకటరమణ, గురునాథం, చంద్రశేఖర్, మహదేవ, సంజయ్, చెరువుముందరపల్లెకు చెందిన నీలేష్ రెడ్డి, పవన్, గుర్రప్ప, రమేశ్, వెంకటేశ్, నాగార్జున కుటుంబాలకు చెందిన వారికి పులివర్తి నాని టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళి, కార్యదర్శి మదనమోహన, ఆర్వీ రమణారెడ్డి, శివకుమార్, మోహన్ రెడ్డి, బావాజాన్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాప్ డీలర్ తొలగింపు

భాకరాపేట, మార్చి 30: చిన్నగొట్టిగల్లు మండలంలోని రేషన్ షాప్ నెంబరు-4 డీలర్ ఎ.మనోహర్‌ను విధుల నుంచి రెవెన్యూ అధికారులు తొలగించారు. మనోహర్ వైసీపీ తరపున ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నట్లు సి-విజిల్ యాప్‌కు ఫిర్యాదు అందడంతో అప్రమత్తమైన రెవెన్యూ అధికారులు శనివారం విధుల నుంచి తొలగించారు.

ఎ.రంగంపేటలో వైసీపీ అల్లరి చేష్టలు

చంద్రగిరి, మార్చి 30: ఎ.రంగంపేటలో టీడీపీ నాయకులు ప్రచారంలో ఉండగా వైసీపీ మూకలు అల్లర్లు సృష్టించడానికి ప్రయత్నించాయి.శనివారం టీడీపీ యువ నాయకుడు పులివర్తి వినీల్ ప్రచారంలో భాగంగా ఉపసర్పంచ్ మోనీష్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. మోనీష్ తండ్రి కృష్ణారెడ్డి సాదరంగా ఆహ్వానించారు.అంతలోనే ఉపసర్పంచ్ మోనీష్‌రెడ్డి వచ్చి అభివృద్ధి పనులు చేస్తుంటే టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారని తెలిపారు. దీంతో అభివృద్ధి చేస్తానంటే ఎవరూ అడ్డుకోరని, ఎ.రంగంపేటలో అసలు అభివృద్ధి ఎక్కడ జరిగిందో తెలపాలని స్థానిక టీడీపీ నాయకులు నిలదీశారు. దీంతో మోనీష్‌రెడ్డి టీడీపీ నాయకులతో దురుసుగా వ్యవహరించాడు.వారు తిరగబడడంతో కొంతమంది అల్లరి మూకలను తీసుకొచ్చి అలజడి సృష్టించాలని ప్రయత్నించాడు.అయితే టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ఉండడంతో వెనుదిరిగారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

రామచంద్రాపురం, మార్చి 30: మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన నెన్నూరు, కేకేవీ పురం కేంద్రాలను ఎన్నికల అధికారి, ఎంపీడీవో ప్రత్యూష శనివారం తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నానీని గెలిపించుకుందాం




సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలరెడ్డి

రామచంద్రాపురం, మార్చి 30: అందరం కలిసికట్టుగా పనిచేసి చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి నానీని గెలిపించుకుందామని టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి కోరారు. నెత్తకుప్పంలో టీడీపీ ఎన్నికల కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యకర్తల సమావేశంలో తిరుమల రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. బాధ్యతగా పనిచేస్తే గెలుపు మనదే అన్నారు.జిల్లా నాయకులు జనార్ధన్‌చౌదరి, ఉమాపతినాయుడు, జేడీ జగన్, డిల్లీనాథరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ధనంజయరెడ్డి, సురేంద్రనాయుడు, మండల నాయకులు ప్రసాద్, గిరినాయుడు, జయచంద్ర నాయుడు, దినేష్, కమలాకరరెడ్డి, చిట్టిబాబునాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాల పెంపుకోసమే ఎంవోయూ

రామచంద్రాపురం, మార్చి 30: వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలతో ఐదు ఫార్మసీ కళాశాలలు అవగాహన ఒప్పందం చేసుకున్నాయి.సెవెన్‌హిల్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.నిరంజన్‌బాబు మాట్లాడుతూ అధ్యాపకులకు లోతైన శిక్షణ, పరస్పర పరిశోధనలు, సాంకేతిక మార్పులు, వర్క్‌షాప్‌లతో విద్యాప్రమాణాలు మరింత పెంచడానికి ఈ ఎంవోయూ కుదుర్చుకున్నట్లు తెలిపారు.

పద్మావతిపురంలో శృతిమించుతున్న ఆగడాలు



సమావేశంలో మాట్లాడుతున్న సుధారెడ్డి

తిరుచానూరు, మార్చి 30: చీకటి పడితే గంజాయి, మందుబాబులతో భయం..భయంగా జీవిస్తున్నామని తిరుపతి రూరల్ మండలం, పద్మావతిపురం పంచాయతీలోని మోటార్సు కాలనీ మహిళలు వాపోయారు. శనివారం పులివర్తి సుధారెడ్డి వారితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఏళ్లతరబడి తాగునీటి సమస్య వేధిస్తోందన్నారు డంపింగ్ యార్డు ఇక్కడే ఉండడంతో దోమలు, దుర్వాసనతో రోగాల బారిన పడుతున్నామని తెలియజేశారు. పులివర్తి సుధారెడ్డి స్పందిస్తూ టీడీపీ అధికారంలోకి వస్తే గంజాయిని నిర్మూలిస్తామన్నారు. మహిళల కోసం టెక్స్‌టైల్ పరిశ్రమలను తీసుకొస్తామన్నారు.

తుమ్మలగుంటలో పట్టపగలే చోరీ

తిరుపతి క్రైం, మార్చి 30: తిరుపతి రూరల్ స్టేషన్ పరిధిలోని తుమ్మలగుంటలో పట్టపగలే ఓ ఇంట్లో చోరీ జరిగింది. శనివారం ఉదయం ఇంటి యజమాని లెనిన్ తాళం వేసి డ్యూటీకి వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి రాగా తలుపులు బద్దలు కొట్టి ఉండడాన్ని గుర్తించాడు. పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





సంస్కృత వర్సిటీలో పల్లెపదం పరవశించింది..!

● ఉల్లాసంగా..ఉత్సాహంగా టాలెంట్‌ఫెస్ట్

తిరుపతి(రూరల్),మార్చి30: తిరుపతిలోని సంస్కృత వర్సిటీ వేదికగా జరిగే ఆలిండియా సంస్కృత విద్యార్థుల టాలెంట్‌ఫెస్ట్‌లో భాగంగా మూడవ రోజు శనివారం నిర్వహించిన పలు క్రీడా, సాంస్కృతిక పోటీలు ఉల్లాసంగా..ఉత్సాహంగా సాగాయి. ఎస్వీ రఘునాథాచార్య ఓపెన్ ఆడిటోరియంలో సాయంత్రం 6గంటల నుంచి నిర్వహించిన జానపదనృత్య పోటీలలో పల్లెపదం పరవశించింది. విద్యార్థులు కాళ్లగు గజ్జెకట్టి గ్రామీణ సంప్రదాయ వస్త్ర, వేషధారణలతో జానపద నృత్యాలు చేసి అదరగొట్టారు. ఆయా ప్రాంతాల్లో ప్రాచుర్యంలో ఉన్న గ్రామదేవతల పండుగలు, ఇతర సంప్రదాయాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించి యువతను ఉర్రూతలూగించారు. ఉదయం వర్సిటీలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన సంస్కృత క్విజ్(రసప్రశ్న పోటీలు) పోటీలు విద్యార్థుల్లో అంతర్లీనమై ఉన్న మేధోశక్తిని వెలికితీసే విధంగా సాగాయి. బ్యాడ్మింటన్ ఫైనల్ పోటీలను నిర్వహించారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ సింగరాజు దక్షిణామూర్తిశర్మ, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎంజీ నందనరావు, అడిషనల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.దత్తాత్రేయశర్మ, ప్రొఫెసర్ సి.రంగనాథన్, డాక్టర్ భరత్‌భూషణ్, ప్రొఫెసర్ నారాయణ, డాక్టర్ లీనాచంద్ర, స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ వి.సేతురామ్ పాల్గొన్నారు.

మేం గజ్జె కడితే నిదురపోదు నిండు రాతిరి

● ఆకట్టుకున్న ఇంజినీరింగ్ విద్యార్థినుల ప్లాష్‌మాబ్ ● నేటి నుంచి పద్మావతి వర్సిటీలో విరించి





తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 30: 'రాజమండ్రి రాగమంజరి.. మాయమ్మ పేరు తెలియనోళ్లు లేరు మేస్త్రీ.. కళాకారుల ఫ్యామిలీ మరి.. మేం గజ్జె కడితే నిదురపోదు నిండు రాతిరి.. ఆ కుర్చీని మడత పెట్టి..' అంటూ పద్మావతి యూనివర్సిటీలో నిర్వహించిన ప్లాష్ మాబ్ అందరినీ ఆకట్టుకుంది. ఆదివారం నుంచి పద్మావతి మహిళా యూనివర్సిటీలో విరించి-2కె24 కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా వర్సిటీ పరిపాలనా భవనం వద్ద శనివారం ప్లాష్ మాబ్ నిర్వహించారు. ఆటపాటలతో విద్యార్థినులు ఆడిపాడి ఆకట్టుకున్నారు. వీసీ ప్రొఫెసర్ భారతి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజిని మాట్లాడుతూ విరించి-2కె24 కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

ఎస్వీయూలో 18 మంది ఉద్యోగులకు మెమోల జారీ

● విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఫలితం
● 3వ తేదీలోపు వివరణ ఇవ్వాలని వీసీ ఆదేశం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 30: ఎస్వీ యూనివర్సిటీలోని పరీక్షల విభాగానికి చెందిన 18 మంది ఉద్యోగులకు మెమోలు జారీ చేశారు. మార్చి 28వ తేదీ పరీక్షల విభాగంలోని పలు సెక్షన్లను వీసీ శ్రీకాంత్ రెడ్డి తనిఖీ చేశారు. ఆ సమయంలో ఆయా సెక్షన్లకు సంబంధించిన ఎక్కువ మంది అధికారులు, ఉద్యోగులు విధుల్లో లేని విషయాన్ని గుర్తించారు. వారు ఆ సమయంలో ఎందుకు విధులకు హాజరు కాలేదో రాత పూర్వకంగా వివరణ ఇవ్వాలని కోరారు. ఏప్రిల్ 3వ తేదీలోపు వివరణ ఇవ్వాలని సూచించారు. వివరణను అనుసరించి తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. విధి నిర్వహణ సమయంలో సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల వీసీ సీరియస్‌గా ఉన్నట్టు తెలుస్తోంది. సర్టిఫికెట్ల కోసం వచ్చే విద్యార్థులకు సకాలంలో పనులు చేయకుండా ఉద్దేశపూర్వకంగానే కొందరు ఉద్యోగులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే పరీక్షల విభాగం పరిధిలోని బీ-9, బీ-5, బీ-6, బీ-4, తదితర విభాగాలను వీసీ తనిఖీ చేసినట్టు తెలుస్తోంది.

కాల్వపోరంబోకు ఆక్రమణకు అడ్డుకట్ట

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి రూరల్,మార్చి30:తిరుపతి రూరల్ మండలం చిగురువాడ ఉత్తరపు కండ్రిగలోని శ్రీనిలయ లేఅవుట్‌లో కాల్వపోరంబోకు భూమి ఆక్రమణపై రెవెన్యూ అధికారులు స్పందించారు.శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో తహసీల్దార్ మహబూబా చాంద్ ఆదేశాల మేరకు వీఆర్వో రవీంద్ర ఆ స్థలంలో సర్వే జరిపించి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేశారు. ఎక్సవేటర్‌తో గాడిని తీసి హద్దు ఏర్పాటు చేశారు.

● **వైసీపీ రంగుల తొలగింపు:** మల్లంగుంట పంచాయతీ పరిధిలోని ప్రియదర్శిని కాలనీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి ఉన్న వైసీపీ రంగులను అధికారులు తొలగించారు.ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా వైసీపీ రంగులు అలాగే దర్శనమిస్తున్నాయని ఈ నెల 28న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పంచాయతీ అధికారులు వైసీపీ రంగులను తొలగించి తెల్లరంగు వేశారు.

సైకో పాలనకు చరమగీతం పాడుదాం

తిరుపతి(రూరల్), మార్చి30: రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓట్లేసి సైకో పాలనకు చరమగీతం పాడుదామని చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని పిలుపునిచ్చారు. తిరుపతి రూరల్ మండలంలోని సి.గొల్లపల్లెలో శనివారం ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. మఠం భూముల ఆక్రమణలు, ఇసుక, మైనింగ్, ఎర్రచందనం మాఫియాలతో కలిసి ప్రజలను ఎమ్మెల్యే దోచుకుంటున్నారని విమర్శించారు.

రెడ్ ఎఫ్ఎం బిజినెస్ అవార్డుల ప్రదానం



తిరుపతి (కల్చరల్), మార్చి 30: 93.5 రెడ్ ఎఫ్ఎం తిరుపతిలోని పలువురు వ్యాపారవేత్తలకు బిజినెస్ బ్రిలియన్స్ అవార్డులను ప్రదానం చేసింది. ప్రైవేటు కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య రంగంలో అమరరాజ, నారాయణాద్రి, డీబీఆర్ హాస్పిటల్స్, విద్యారంగంలో సీకాం, ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజి, ఎస్డీహెచ్ఆర్ డిగ్రీ కళాశాల, ఏటిఎంఎస్ జూనియర్ కళాశాల, హోటల్ విభాగంలో చిల్లీస్, ఆటోమొబైల్ రంగంలో హైటెక్ నిస్సాన్ వంటి 33 సంస్థలకు అవార్డులు అందజేసింది.

నేడు గగనలో పాలిసెట్‌పై ఉచిత అవగాహన

తిరుపతి(విద్య),మార్చి30: రాజన్నపార్క్ సమీపంలోని శ్రీగగన ఎడ్యుకేషన్ సొసైటీ సంస్థల్లో ఆదివారం ఉదయం 10 గంటలకు ఏపీ పాలిసెట్-2కె24పై ఉచిత అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఎ.కరుణామూర్తి పేర్కొన్నారు. పాలిటెక్నిక్ కోర్సుల ద్వారా లభించే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ఈ పరీక్షకు ప్రిపరేషన్, సిలబస్‌లతో పాటు దరఖాస్తు ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తామని, వివరాల కోసం 9014052757ను సంప్రదించాలని కోరారు.

ఎస్సీ ఎస్టీలను పూర్తిగా పక్కనబెట్టారు

● దళిత ఐక్య మహానాడు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), మార్చి 30: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ ఎస్సీ, ఎస్టీల సంక్షేమాన్ని పూర్తిగా పక్కనబెట్టారని ఐక్య దళిత మహానాడు జాతీయ అధ్యక్షుడు కల్లూరి చంగయ్య విమర్శించారు. శనివారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలు వెన్నుదన్నుగా నిలిచి వైసీపీని గెలిపించారని తెలిపారు. అనేక మంది కేసుల పాలయ్యారన్నారు. జగన్ సీఎం అయ్యాక ఆ వర్గాలను మరిచిపోయారని అన్నారు. గడిచిన ఐదేళ్లలో తమకు ఎటువంటి సహకారమూ లభించలేదని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించడం బాధ కలిగించిందన్నారు. దళితులకు భూపంపిణీ పూర్తిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్య మహానాడు తిరుపతి జిల్లా అధ్యక్షుడు కొప్పాల మురళి, కడప జిల్లా అధ్యక్షుడు గాలి ప్రశాంత్, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు బి. పరందామయ్య, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు గాడి సుమన్ పాల్గొన్నారు.

జనసేనలోకి వైసీపీ నాయకులు



జనసేనలో చేరిన లక్ష్మీపతి రాయల్

తిరుపతి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీలో పలువురు వైసీపీ నాయకులు చేరారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసుల సమక్షంలో వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు బండ్ల లక్ష్మీపతి రాయల్ తదిరులు జనసేన కండువాలు కప్పుకున్నారు. మరింతమంది వైసీపీని వీడనున్నట్టు ఆయన తెలిపారు. భూమన అభినయ్ రెడ్డిని ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు.

టీడీపీలోకి వైసీపీ నేతలు



టీడీపీలో చేరిన చంద్రశేఖర్ యాదవ్

ఏర్పేడు, మార్చి30 : టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో ఏర్పేడు మండలం నుంచి పెద్దఎత్తున వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. వీరిలో మాజీ ఎంపీటీసీ, యాదవ సంఘ అధ్యక్షుడు ఊటి చంద్రశేఖర్ యాదవ్ ఉన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి విజయానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు.

తిరుమల ఘాట్‌లో ప్రమాదం

చెట్టును ఢీకొన్న కారు : బెంగళూరు భక్తురాలి మృతి





తిరుపతి బర్డ్ ఆస్పత్రికి మురళీధర్ తరలింపు
భవాని మృతదేహం



ప్రమాదానికి గురైన కారు

తిరుమల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ భక్తురాలు మృతి చెందింది. మరో భక్తుడికి తీవ్ర గాయాలు కాగా ముగ్గురు పిల్లలు స్వల్పగాయాలతో బయటపడ్డారు. బెంగళూరుకు చెందిన మురళీధర్, భవాని దంపతులు పదిమంది కుటుంబ సభ్యులతో మూడు కార్లలో శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చారు.శనివారం సాయంత్రం 6 గంటలకు తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. మురళీధర్,భవానీ,వారి ఇద్దరు పిల్లలు ప్రజ్వల్, నిసర,మురళీధర్ అన్న కుమార్తె రక్షితతో కలిసి సాంత్రో కారులో తిరుమల నుంచి బయలుదేరారు.ఏనుగుల ఆర్చి దాటిన తర్వాత కారు అదుపుతప్పి ఎడమవైపున్న అడవిలోకి దూసుకెళ్లి చెట్టును ఢీకొంది. వెనుకవస్తున్న కుటుంబ సభ్యులు, ఇతర ప్రయాణికులు, ప్రమాదానికి గురైన కారులోని మురళీధర్ దంపతులను, పిల్లలను వెలుపలకు తీసుకువచ్చారు. అంబులెన్స్ ద్వారా తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తీసుకురాగా,వైద్యులు పరిశీలించి భవాని అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. కారు ముందు సీట్లో ఉన్న భవాని తల గట్టిగా డ్యాష్ బోర్డుకు కొట్టుకోవడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు వైద్యులు అభిప్రాయపడ్డారు.పిల్లలు స్వల్పగాయాలతో బయటపడగా, డ్రైవింగ్ చేస్తున్న మురళీధర్ తీవ్రంగా గాయపడ్డారు.టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఆస్పత్రికి చేరుకుని మెరుగైన చికిత్స కోసం మురళీధర్‌ను తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రికి తరలించారు. నిద్రమత్తే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని భద్రతా సిబ్బంది అనుమానం వ్యక్తపరుస్తున్నారు.

వెక్కివెక్కి ఏడ్చిన చిన్నారులు

తల్లి మృతదేహం ఒకవైపు, శరీరం మొత్తం రక్తగాయాలై ఎలాంటి కదలికలు లేకుండా పడివున్న తండ్రిని చూసి వారి ఇద్దరు చిన్నారులు వెక్కివెక్కి ఏడ్చారు. 'పైకి లే అమ్మా.. మాట్లాడమ్మా' అంటూ కన్నీరుమున్నీరయ్యారు.దైవదర్శనం కోసం వస్తే ఇలా జరిగిందేంటీ స్వామీ అంటూ కుటుంబ సభ్యులు కూడా రోదించడంతో ఆస్పత్రి ప్రాంతమంతా విషాదఛాయలు అలుముకున్నాయి.

వైసీపీ ప్రచార సామగ్రి నిల్వపై ఫిర్యాదు

గోదాముల నిర్వాహకులు నలుగురిపై కేసు

రేణిగుంట, మార్చి 30 : వైసీపీ ప్రచార సామగ్రి భారీ ఎత్తున నిల్వ చేసిన మూడు గోదాముల నిర్వాహకులు నలుగురిపై కేసు నమోదయ్యింది. రేణిగుంట మండలం పాత విమానాశ్రయ రోడ్డులోని మూడు గోదాముల్లో పెద్ద ఎత్తున వైసీపీ ప్రచార, ప్రభావిత సామగ్రి మూడురోజుల క్రితం బయటపడిన విషయం తెలిసిందే. టీడీపీ నాయకుల ఆందోళనతో ప్రచార సామగ్రిని సీజ్ చేసిన అధికారులు శుక్రవారం కలెక్టర్ అనుమతితో తరలించడానికి అనుమతించారు. కాగా వైసీపీ ప్రచార, ప్రభావిత సామాగ్రిని భద్రపరచిన గోదాముల నిర్వాహకులపై రేణిగుంట ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి సలోమి శనివారం గాజులమండ్యం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ప్రచార సామగ్రిని కొనుగోలు చేసిన సుమన్, గోడౌన్‌లో ప్రచార సామగ్రి ఇన్‌ఛార్జులు అనిల్, రమేష్‌రెడ్డి, గోదాము ఇన్‌ఛార్జి రవికుమార్‌పై 188వ సెక్షన్ కింద కేసు నమోదు చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సుబ్బారాయుడు తెలిపారు. అలాగే రేణిగుంట అర్బన్ పోలీసు స్టేషన్లో కూడా గోదాముల నిర్వాహకులు సుమన్, ప్రచార సామగ్రి ఇన్‌ఛార్జులు అనిల్, రమేష్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు.

అసలీ ఎమ్మెల్వో ఎవరు?

● వలంటీర్లను రాజీనామా చేయమనడంపై విచారణ

వరదయ్యపాళెం, మార్చి 30: 'రాజీనామా చేసి వైసీపీ తరపున ప్రచారంలో పాల్గొనండి...పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చాక మిమ్మల్నే విధుల్లోకి తీసుకుంటాం' అంటూ వలంటీర్లపై ఒక మండల లెవల్ ఆర్గనైజర్ (ఎమ్మెల్వో) ఒత్తిడి చేయడంపై శనివారం పత్రికల్లో వెలువడిన కథనాలు వరదయ్యపాళెం మండలంలో కలకలం రేపాయి. అసలు ఈ ఎమ్మెల్వో చంద్ర ఎవరనే విషయంపై చర్చ నడిచింది. పత్రికా కథనాలపై ఎంసీసీ(మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అధికారి చిరంజీవి స్పందించి ఆ వలంటీర్లు పనిచేసే సచివాలయ అధికారి బసిరెడ్డికి విచారణ జరపాలని నోటీసు పంపారు. వలంటీర్లను పిలిపించి బసిరెడ్డి వివరణ కోరగా ప్రతి పథకం అమలు చేసే సమయంలో ఎమ్మెల్వో చంద్ర పెట్టే గ్రూప్ మీటింగుల మాదిరిగానే ఈ నెల 28వ తేదీ సాయంత్రం 6గంటల సమయంలో ఫోన్ చేసి డేటా అడగ్గా కొంతమంది స్పందించి వివరాలు చెప్పామన్నారు. ఎప్పుడూ జరిగే కార్యక్రమమే కదా అని స్పందించామంటూ వలంటీర్లు వివరణ ఇచ్చారు. ఈ సమాచారాన్ని ఇన్‌ఛార్జి ఎంపీడీవో అనసూయకు, ఎంసీసీ అధికారి చిరంజీవికి కార్యదర్శి బసిరెడ్డి తెలిపారు. వారు ఆ నివేదికను తిరుపతి డీఎల్డీవో, జీఎస్ డబ్ల్యూ కార్యాలయ అధికారులకు పంపించారు. అసలు ఈ ఎమ్మెల్వో చంద్ర ఎవరు? ఆయన్ను ఎవరు నియమించారు? ఎక్కడ ఉంటారు? తెలుసుకుని కేసు నమోదు చేయిస్తామని చిరంజీవి, అనసూయ తెలిపారు.

ఘనంగా ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ వార్షికోత్సవం



తిరుపతి(విద్య), మార్చి 30: ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులతో కలిసి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ద్వారకనాథరెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్టేట్‌బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ కార్యదర్శి కేవీ రమణబాబు మాట్లాడుతూ విద్యార్థులు క్యాంపస్ సెలెక్షన్స్‌లో ప్లేస్‌మెంట్ పొందేలా ప్రతిభ సాధించాలని సూచించారు. మరో అతిథి ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ డిప్యూటీ చీఫ్ టి.శ్రీనివాసులు మాట్లాడుతూ డిప్లొమా విద్యార్థులు ఎంప్లాయిమెంట్ స్కిల్స్ పెంపొందించుకుంటే ఉద్యోగావకాశాలు సులభంగా దొరుకుతాయని చెప్పారు. శ్రీసిటీకి చెందిన ఓజి ఇండియా పాకింగ్ కంపెనీ మేనేజర్ కళ్యాణరాము మాట్లాడుతూ ప్రస్తుతం పరిశ్రమల్లో డిప్లొమా విద్యార్థులకు బాగా డిమాండ్ ఉందన్నారు. విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేశారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు.

ఎఫ్ఎన్‌వోకు సన్మానం



ఎఫ్ఎన్‌వోను సన్మానిస్తున్న సూపరింటెండెంట్ రవిప్రభు

తిరుపతి(వైద్యం), మార్చి 30 : రుయాస్పత్రిలో 30 ఏళ్లకు పైగా రోగులకు సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన టి.సావిత్రిని శనివారం సూపరింటెండెంట్ రవిప్రభు, ఏడీ రత్నరాజు సన్మానించారు. ఆయన మాట్లాడుతూ రోగులకు సేవ చేసే అవకాశం లభించడం దేవుడిచ్చిన భాగ్యమని, ఇది వైద్యరంగంలో ఉన్న వారికి మాత్రమే లభించే గొప్ప అదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ప్రకాష్, ఏవో రమేష్, యూనియన్ నేతలు వరప్రసాద్, రాజా తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.41 కోట్లు

తిరుమల, మార్చి30(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.41 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 60,958 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 31,245 మంది తలనీలాలు సమర్పించారు.

9న తిరుమలలో ఉగాది ఆస్థానం

తిరుమల, మార్చి30 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఏప్రిల్ 9వ తేదీన శ్రీక్రోధినామ సంవత్సర ఉగాది ఆస్థానం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఉదయం 3 గంటలకు సుప్రభాతం నిర్వహించి, తర్వాత శుద్ధి నిర్వహిస్తారు. 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి, విశ్వక్సేనుల స్వామికి విశేష సమర్పణ చేస్తారు. 7 నుంచి 9 గంటల వరకు విమాన ప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోకి ప్రవేశిస్తారు. తర్వాత శ్రీవారి మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలు ధరింపజేస్తారు. అనంతరం పంచాంగ శ్రవణం చేస్తారు. ఉగాది ఆస్థానాన్ని బంగారు వాకిలి వద్ద అర్చకులు, ఆగమపండితులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఉగాదిని పురస్కరించుకుని అష్టదళ పాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవాన్ని టీటీడీ రద్దు చేసింది.

శ్వేతలో ఆముదాల మురళి



మురళిని సన్మానిస్తున్న రచయితలు

తిరుపతి (కల్చరల్), మార్చి 30: ప్రముఖ పండితులు, శతావధాని ఆముదాల మురళి ఇటీవల టీటీడీలో సహాయ పరిశోధకుడిగా బాధ్యతలు చేపట్టారు. శ్వేత సంచాలకులు డాక్టర్ భూమన్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఏడాది పాటు శ్రీవేంగమాంబ ప్రాజెక్టులో ఆయన విధులు నిర్వహిస్తారు. మురళిని ప్రముఖ కథా రచయిత రాసాని, అరసం తిరుపతి జిల్లా కార్యదర్శి డాక్టర్ నెమిలేటి కిట్టన్న తదితరులు అభినందించారు.

విద్యార్థుల ప్రతిభకు సర్టిఫికెట్ల ప్రదానం

తిరుపతి(విద్య),మార్చి30: న్యూబాలాజీ కాలనీలోని భాష్యం(జెడ్‌సీవో) స్కూల్‌లో వీవా ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రియేటివ్ కరౌసెల్ పోటీలలో పలువురు విద్యార్థులు ప్రతిభచాటారని జోనల్ ఇన్‌చార్జి లక్ష్మణ్ పేర్కొన్నారు. జోనల్ స్థాయిలో తమ విద్యాసంస్థల్లో 1-5తరగతులు చదివే విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించగా ఎక్కువసంఖ్యలో బహుమతులు, సర్టిఫికెట్లు సాధించారని తెలిపారు. గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. జెడ్‌సీవో బిందు మాధవి, ప్రిన్సిపాల్స్, హెచ్ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.

సమ్మర్‌క్యాంప్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి(విద్య),మార్చి30: ఎమ్మార్‌పల్లిలోని ఆర్కే అబాకస్ ఆధ్వర్యంలో నిర్వహించే సమ్మర్ క్యాంప్ వాల్ పోస్టర్లను శనివారం బైరాగిపట్టెడలోని వీక్షదస్కూల్‌లో ఆవిష్కరించారు. సంస్థ చైర్మన్ డాక్టర్ టి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి గణితంపై ఉన్న భయాన్ని తొలగించడానికి అబాకస్ విద్య దోహదం చేస్తుందన్నారు.

బయో వ్యర్థాలను వదిలేస్తే ప్రమాదం

తిరుపతి(వైద్యం), మార్చి 30 : ఆస్పత్రుల్లో బయో వ్యర్థాలను నిర్లక్ష్యంగా వదిలేస్తే వ్యాధులు వచ్చే అవకాశముందని కాలుష్య నియంత్రణ పరిశోధకులు సుధాకర్, అశోక్ పేర్కొన్నారు. బయో వ్యర్థాల నిర్వహణ-వాటిని భద్రపరిచే విధానంపై వారు రుయాస్పత్రిలోని హెడ్‌నర్సులకు, పారిశుధ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. బయో వ్యర్థాలను నిర్దేశించిన ప్రదేశంలోనే వేయాలన్నారు. ఎక్కడపడితే అక్కడ వదిలేస్తే వాటిలోని వైరస్ గాల్లోకి చేరి వ్యాధులను వ్యాపింపజేస్తాయని వివరించారు. ఏఆర్ఎంవో డాక్టర్ హరికృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి

బరితెగించినా చర్యలు తీసుకోరా?



సుందరయ్యనగర్‌లో శనివారం వైసీపీ ప్రచారంలో డీలర్లు నాదముని, శారద

తిరుపతి(నేరవిభాగం), మార్చి 30 : ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్న ఉద్యోగులు, వలంటీర్ల మీద తిరుపతి జిల్లా ఎన్నికల అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదు. పత్రికల్లో, సోషల్ మీడియాలో వీరి ప్రచార చిత్రాలు, వీడియోలు కనిపిస్తున్నా పట్టించుకోవడం లేదు. తాజాగా శనివారం తిరుపతిలోని సుందరయ్యనగర్, రైల్వే కాలనీ, మధురానగర్ ప్రాంతాల్లో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఎన్నికల ప్రచారం చేశారు. ఈయనతోపాటు సుందరయ్యనగర్‌లోని 46, 47 రేషన్ దుకాణాల డీలర్లు నాదముని, శారద పాల్గొన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కొన్నిచోట్ల కరపత్రాలు పంపిణీ చేశారు. టీటీడీ చైర్మన్‌తోపాటు ఎన్నికల ప్రచారం ఫొటోలకు పోజులిచ్చారు. ఒక వలంటీరు కూడా ఈ ప్రచారంలో పాల్గొన్నారని తెలిసింది. భూమన వెంట ప్రభుత్వ జీతం తీసుకునే టీటీడీ ఉద్యోగులే ప్రచారంలో పాల్గొంటున్నా పట్టించుకోని అధికారులు వీరి మీద మాత్రం ఏమి చర్యలు తీసుకుకుంటారులే అని జనం విమర్శిస్తున్నారు.

శివం ఏసీ వర్క్స్‌లో అగ్నిప్రమాదం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మంగళం, మార్చి 30: తిరుపతి-కరకంబాడి మార్గం గెస్ట్‌లైన్ హోటల్ సమీపంలోని శివం ఏసీ వర్క్స్ వద్ద శనివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. నిర్వాహకుడు శివ చెడిపోయిన వాషింగ్ మిషన్లు, ఏసీలు, ఫ్రిడ్జిలు రిపేరు చేసేందుకు షాపు పక్కనే పెట్టాడు. సమీపంలోని కీర్తి న్యూరో ఆస్పత్రి వద్ద ఏర్పడిన మంటలు ఈ దుకాణం వరకు వ్యాపించాయి. 20 వాషింగ్ మిషన్లు, 10 ఏసీలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేశారు.

నేడు కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

తిరుపతి సెంట్రల్, మార్చి 30 : తిరుపతి విద్యుత్ సర్కిల్ (చిత్తూరు జిల్లా) పరిధిలోని వినియోగదారులు ఆదివారం కూడా బిల్లులు చెల్లించే సదుపాయం కల్పించామని సర్కిల్ ఈఈ ఎం.కృష్ణారెడ్డి తెలిపారు. సర్కిల్ పరిధిలో ఉన్న తమ రెవెన్యూ కార్యాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సిబ్బంది పనిచేస్తారని పేర్కొన్నారు.

క్రైం స్టేషన్ పక్కన గుర్తు తెలియని వాహనం



తిరుపతి(ఆటోనగర్), మార్చి 30: క్రైం పోలీస్‌స్టేషన్ గోడ పక్కన మూడేళ్లుగా గుర్తు తెలియని వాహనం పార్కింగ్ చేసి ఉంది. నిత్యం పోలీసులు ఆ మార్గంలో రాకపోకలు సాగిస్తూ ఉన్నా దీని గురించి పట్టించుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనం అయితే ఏడాది తర్వాత వేలం వేయాలి. అదీ జరగలేదు. ఇప్పటికైనా దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

వైసీపీని గద్దె దించడమే లక్ష్యం : ఎమ్మార్పీఎస్



తిరుపతి(ఉపాధ్యాయనగర్), మార్చి 30 : వైసీపీని గద్దె దించడమే మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ప్రధాన లక్ష్యమని ఆ సంఘం నాయకులు స్పష్టం చేశారు. ఎమ్మార్పీఎస్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు వేలూరు రాజేంద్ర శనివారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం పోరాడుతోందన్నారు. గత నవంబరులో హైదరాబాదులో జరిగిన మాదిగల విశ్వరూప మహాసభకు ప్రధాని నరేంద్రమోదీ హాజరై వర్గీకరణకు సంపూర్ణ మద్దతు తెలియజేశారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు పూర్తి మద్దతు ప్రకటించారని చెప్పారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణను వ్యతిరేకిస్తోందన్నారు. పార్లమెంటులో వర్గీకరణ బిల్లుకు మద్దతు ఇవ్వకపోగా ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని వైసీపీ అసెంబ్లీలో మాట్లాడిందని వివరించారు. అందుకే మాదిగ జాతి యావత్తు వైసీపీకి వ్యతిరేకంగా, టీడీపీ కూటమికి అనుకూలంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. సీనియర్ నాయకులు గోపి, అమర్నాథ్, శివయ్య, వెంకటేష్, రవి, నరేష్, లక్ష్మయ్య, నాగరాజు, మునిరాజ పాల్గొన్నారు.

ముగిసిన ఇంధన పొదుపు శిక్షణ తరగతులు

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 30: ప్రజారవాణాధికారి కార్యాలయంలో వారం రోజులుగా జరిగిన ఇంధన పొదుపు శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. శిక్షకులు ఎం.డి.హనీఫ్ ఆధ్వర్యంలో ఆరు రోజులలో తిరుపతి, చిత్తూరు జిల్లాలకు సంబంధించిన 228మంది డ్రైవర్లు, 11మంది ఎస్డీఐలు, ముగ్గురు ఆర్ఎస్డీఐలు, 16 డిపోల నుంచి మేనేజర్లు, గ్యారేజీ ఇన్‌చార్జ్‌లు, కెఎంపీఎల్ మెకానిక్‌లకు శిక్షణ ఇచ్చారు.

ఇద్దరు రుయా ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

తప్పుడు రిపోర్టులు ఇచ్చిన ఫలితం

తిరుపతి (వైద్యం), మార్చి 30 : వైద్యం కోసం వచ్చిన రోగికి హెచ్ఐవీ అంటూ తప్పుడు రిపోర్టులు ఇచ్చిన ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ సూపరింటెండెంట్ రవిప్రభు శనివారం ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదంలో కాలిగి గాయమైన ఓ యువకుడు పది రోజుల కిందట వైద్యం కోసం రుయాస్పత్రికి వచ్చాడు. వైద్యుల సూచన మేరకు రుయాస్పత్రిలోని ల్యాబ్‌లో రక్త పరీక్షలు చేయించుకున్నాడు. యువకుడికి హెచ్ఐవీ పాజిటివ్ అని తప్పుడు రిపోర్టులు ఇచ్చారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో వార్తలు ప్రచురితం కావడంతో రుయా సూపరింటెండెంట్ రవిప్రభు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి తప్పుడు రిపోర్టులు ఇచ్చిన ల్యాబ్ టెక్నీషియన్ బి.రాజశేఖర్ నాయక్, ల్యాబ్ అటెండరు ఎన్.రమణ మోహన్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. విచారణ కొనసాగుతోందని, పూర్తయ్యే వరకు అందుబాటులో ఉండాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ల్యాబ్‌ను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాల్సిన మైక్రోబయాలజీ విభాగాధిపతి, డాక్టర్లను తప్పించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. సాధారణంగా ల్యాబ్ నుంచి వచ్చే ప్రతి రిపోర్టును ల్యాబ్ విభాగాధిపతి లేదా సంబంధిత డాక్టర్లు పరిశీలించిన తర్వాతనే రోగులకు అందించాలి.

బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశాల్లో విశ్వం విద్యార్థుల హవా



తిరుపతి(విద్య), మార్చి 30: బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశాల్లో విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని విశ్వం విద్యా సంస్థల అధినేత ఎన్. విశ్వనాథరెడ్డి తెలిపారు. బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాలు శనివారం విడుదలయ్యాయని, విశ్వంలో శిక్షణ పొందిన వంశితశ్రీ, మనోజ్ఞబాయి, సోనిక, దర్శిణిశ్రీ, నిత్యశ్రీ, వర్షిణి సైనిక్ స్కూల్ ప్రవేశం సాధించారని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎస్.తులసి విశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి అభినందించారు.

4న ఆర్టీసీ కొత్త బస్సుల రాక

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 30: వచ్చే నెల 4వ తేదీన జిల్లాకు 8 కొత్త ఆర్టీసీ బస్సులు రానున్నాయి. అశోక్‌లేల్యాండ్, టాటా సంస్థల ద్వారా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన భారత్‌స్టేజ్ 6తో కూడిన ఈ బస్సులు ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటాయని అధికారులు తెలిపారు. ఇందులో తిరుపతి జిల్లా పరిధిలోని తిరుపతి డిపోకు ఓ అల్ట్రా డీలక్స్, శ్రీకాళహస్తి డిపోకు 2 సూపర్‌లగ్జరీ, చిత్తూరు జిల్లా పరిధిలోని చిత్తూరు-1డిపోకు 2సూపర్‌లగ్జరీ, 2డిపోకు ఓ సూపర్‌లగ్జరీ, అన్నమయ్య జిల్లా పరిధిలో మదనపల్లె-1డిపోకు 2సూపర్‌లగ్జరీ కేటాయించనున్నారు.







రోడ్డు నవ్వుతోంది 'మాస్టర్'

- ఖాదీకాలనీ ఖల్లాస్
- విస్తరణ పేరుతో 7 నెలలుగా దారిలేక అవస్థలు
- అధికార పార్టీకి అక్కడ ఓట్లు రావనే ఆలస్యం

తిరుపతి-ఆంధ్రజ్యోతి: మాస్టర్‌ప్లాన్ రోడ్లకు బ్రాండ్ అంబాసిడర్‌గా చెప్పుకుంటున్న వైసీపీ నేతలను చూసి నగరంలోని ఖాదీ కాలనీ రోడ్డు నవ్వుకుంటోంది. రోడ్డు విస్తరణ పేరిట 7 నెలల క్రితం చేపట్టిన పనులు ఇప్పటికీ పూర్తికాకపోవడంతో దారిలేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి రోడ్డుకడ్డంగా పైపులు వేసేయడంతో వాటిని దాటుకుంటూ ద్విచక్ర వాహనదారులు ప్రయాణం కొనసాగిస్తున్నారు. కంకర వేసేయడంతో దుమ్ముకొట్టుకుంటూ స్థానికులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. అక్కడ ఓట్లు రావనే కారణంతో వైసీపీ నేతల ఒత్తిడి మేరకే పనులు ఆలస్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. టీడీఆర్ బాండ్ల జారీలో స్థానికులు లోపాయికారి ఒప్పందానికి అంగీకరించకపోవడం కూడా మరొక కారణంగా తెలుస్తోంది. మాస్టర్ ప్లాన్ రోడ్ల విస్తరణలో భాగంగా గత ఏడాది సెప్టెంబరు మొదటివారంలో ఇక్కడ పనులు ప్రారంభించారు. తిరుపతి నగరపాలక సంస్థ కౌన్సిల్ తీర్మానం మేరకు ప్రస్తుతం ఉన్న 30 అడుగుల రోడ్డును 40 అడుగులుగా విస్తరిస్తున్నారు. పనుల ప్రారంభానికి రెండు నెలల ముందే రోడ్డు కిరువైపులా ఐదు అడుగుల చొప్పున నిర్మాణాలు తొలగించుకోవాలని మార్కింగ్ చేశారు. కొందరు స్వచ్ఛందంగా తొలగించారు.మిగిలినవాటిని కార్పొరేషన్ యంత్రాంగం సహాయంతో తొలిగించారు. ఈ క్రమంలో పచ్చని చెట్లను నేలకూల్చారు. విస్తరణ చేసిన రోడ్డు మేరకు కంకర రాళ్లు తోలి వదిలేశారు. నిత్యం వేలాది వాహనాలు ప్రయాణించే చోట రోడ్డును అర్ధంతరంగా నిలిపివేయడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సుగుణమ్మా...కలిసి పనిచేయాల్సిందేనమ్మా!

- నాయకులందరూ కూటమి అభ్యర్థి విజయానికి సహకరించాలి
- మీ భవిష్యత్ నేను చూసుకుంటా
- తిరుపతి నేతలకు చంద్రబాబు దిశా నిర్దేశం



తిరుపతి, మార్చి30(ఆంధ్రజ్యోతి) : 'పొత్తులో భాగంగా తిరుపతి సీటు జనసేనకు కేటాయించాం. పెద్ద కేడర్ ఉండేచోట టికెట్ మనకు లేకపోవడం నాకు కూడా బాధగా ఉంది. సుగుణమ్మా...మీకు ఇదివరకే చెప్పాను కదా! కలిసి పనిచేయాల్సిందేనని, మీ భవిష్యత్తు నేను చూసుకుంటా' అంటూ టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శ్రీకాళహస్తిలో శనివారం జరిగిన ప్రజాగళం కార్యక్రమం అనంతరం తిరుపతి నేతలు ఆయనతో భేటీ అయ్యారు. కూటమి అభ్యర్థి విజయం కోసం అందరూ కలసి పనిచేయాల్సిందేనని, 2019లో కూడా గెలిచిన సీటును వాళ్ల ప్రకటించుకున్నారని అన్నారు. తిరుపతిలో వైసీపీ నేతల అరాచకంపై వ్యతిరేకత ఉందని, అందరూ కూర్చుని మాట్లాడుకుని కలిసి పనిచేయాలని, మళ్లీ తాను ఫోన్ చేసేలా చేసుకోవద్దని, పేరుపేరునా పిలిచి దిశానిర్దేశం చేశారు. పదేపదే సుగుణమ్మను ఉద్దేశించి చెప్పడంతో ఆమె కంటతడి పెట్టుకుని ఆయన పాదాలకు నమస్కారం చేశారు. చంద్రబాబును కలిసిన వారిలో నరసింహ యాదవ్, చిట్టిబాబు, ఊకా విజయకుమార్, ఆర్సీ మునికృష్ణ, జేబీ శ్రీనివాస్, పులుగోరు మురళి, దంపూరి భాస్కర్, బుల్లెట్ రమణ, పుష్పావతి, ఊట్ల సురేంద్ర నాయుడు, చినబాబు, మహేష్ యాదవ్, కంకణాల రజినీకాంత్, మునిశేఖర్ రాయల్, బ్యాంకు శాంతమ్మ, ఆర్సీ శ్రీనివాసులు, సుబ్బుయాదవ్, కొట్టే హేమంత్ రాయల్ తదితరులు ఉన్నారు.

విద్యార్థినులకు తైక్వాండో శిక్షణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 30: పద్మావతి యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో విద్యార్థినులకు శనివారం తైక్వాండో శిక్షణ ఇచ్చారు. కోచ్ రమణన్ శిక్షణ ఇచ్చారు. చదువుతోపాటు మహిళలకు ఆత్మ రక్షణ విద్య అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

17 నుంచి శ్రీరామ నవమి ఉత్సవాలు

తిరుపతి (కల్చరల్), మార్చి 30: కోదండరామస్వామి ఆలయంలో ఏప్రిల్ 17 నుంచి 19వ తేదీ వరకు శ్రీరామనవమి వేడుకలు నిర్వహించనున్నట్లు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. 17న ఉదయం మూలవర్లకు అభిషేకం, స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం శ్రీరామనవమి ఆస్థానం ఉంటాయని, రాత్రి 7 గంటలకు హనుమంత వాహనంపై స్వామి వారు మాడవీధుల్లో విహరిస్తారని పేర్కొంది. 18న సీతారాముల కల్యాణం ఉంటుందని, రూ.వెయ్యి చెల్లించి గృహస్తులు పాల్గొనవచ్చునని తెలిపింది. 19వ తేదీ రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు పట్టాభిషేకం ఉంటుందని వెల్లడించింది. 20వ తేదీన పార్వేట ఉత్సవం, 21నుంచి 23వ తేదీ వరకు తెప్పోత్సవాలు జరుగుతాయని తెలిపింది. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు రామచంద్ర పుష్కరిణిలో తెప్పోత్సవాలు ఉంటాయని పేర్కొంది.

ఉరేసుకుని పాపిరెడ్డిపల్లి వాసి ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), మార్చి 30 : ఎస్ఆర్‌పురం మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన ఈదల రవి (55) చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం తిరుపతిలో చోటుచేసుకుంది. యూనివర్సిటీ పోలీసులు చెప్పిన వివరాల మేరకు.. రవి పుత్తూరు, తిరుపతి ప్రాంతాల్లో కూలి పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. భార్య గీత, కుమారుడు బెంగళూరులో ఉంటున్నారు. మద్యానికి బానిసై కొంత అప్పులు చేశాడు. జీవితంపై విరక్తి చెంది ఎస్వీ యూనివర్సిటీ పరిధిలోని రక్షణ దళం విశ్రాంత కార్యాలయం ఎదుట చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతుడి భార్యకు, అలిపిరి స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న అక్క మునిలక్ష్మికి సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

3న స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 30: పద్మావతి యూనివర్సిటీ బీఎడ్, బీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఏప్రిల్ 3వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఎడ్యుకేషన్ విభాగంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఈ అడ్మిషన్లు చేపడతారు. సమగ్ర వివరాల కోసం 944164594లో సంప్రదించవచ్చునని పీఆర్వో డాక్టర్ శ్రీరజని తెలిపారు.

బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది

- ఐటీ బీజేపీ అనుబంధ శాఖగా మారిపోయింది : కాంగ్రెస్



తిరుపతి(ఉపాధ్యాయనగర్), మార్చి 30: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బండ్లపల్లి గోపి విమర్శించారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ ప్రజాబలంతో గెలవడానికి బదులుగా ప్రతిపక్షాలను అణగదొక్కి తద్వారా లాభం పొందాలనే కుయుక్తితో బీజేపీ నడుస్తోందన్నారు. ఆదాయ పన్ను విభాగం బీజేపీ అనుబంధ శాఖగా మారిపోయిందని ఆరోపించారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా కంపెనీల నుంచి వేల కోట్ల రూపాయలు దండుకున్న బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్షాలు కరపత్రాలు వేసేందుకు అవకాశం లేకుండా ఆర్థిక మూలాలను దెబ్బకొడుతోందని దుయ్యబట్టారు. ప్రధాని మోదీ నియంతలా వ్యవహరిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా చైర్మన్ రవి, పీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి భానుప్రకాష్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు నజీర్ పటేల్, కాంగ్రెస్ పట్టణ ఉపాధ్యక్షులు తమీముల్లా, షేక్ జావెద్, నాగరాజయాదవ్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉద్యోగం దేవుడిచ్చిన వరంలా భావించాలి



వెంకటసుబ్బయ్య, నరసింహారెడ్డిని సన్మానిస్తున్న సీఎండీ సంతోషరావు

తిరుపతి సెంట్రల్, మార్చి 30 : ఉద్యోగం దేవుడిచ్చిన వరంగా భావించాలని, అప్పుడే అంకితభావంతో పనిచేయగలరని సదరన్ డిస్కం సంస్థ సీఎండీ కె.సంతోషరావు పేర్కొన్నారు. సంస్థ జీఎం వెంకటసుబ్బయ్య, డీవైఈఈ నరసింహారెడ్డి ఉద్యోగ విరమణ కావడంతో శనివారం కార్పొరేట్ కార్యాలయ ప్రాంగణంలో సన్మానించారు. సీఎండీ మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో ఉద్యోగం సాహసంతో కూడుకున్నదన్నారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో ఉద్యోగులు ప్రాణాలకు తెగించి పనిచేయడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. డైరెక్టర్లు ఎస్‌వీఎస్ సుబ్బరాజు, వీఎన్ బాబు, శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ సంస్థలో చిన్న ఉద్యోగంలో చేరిన వెంకటసుబ్బయ్య, నరసింహారెడ్డి క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి చేరుకున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో సీజీఎంలు లక్ష్మీనరసయ్య, అయూబ్‌ఖాన్, ధర్మజ్ఞాని, డి.వి.చలపతి, పి.మురళి, వరకుమార్, ఎం.కృష్ణారెడ్డి, వాసుదేవరెడ్డి, వాసురెడ్డి, చిన నరెడ్డప్ప, విజయభాస్కర్, రవికుమార్, చంద్రశేఖర్, బాబు, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం, నగదు తరలింపును అడ్డుకోండి : జేసీ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 30: సరిహద్దు రాష్ట్రాల నుంచి మద్యం, నగదు, ఓటర్లను ప్రభావితం చేసే కానుకల అక్రమ తరలింపును అడ్డుకోవాలని ఎన్నికల అధికారులను జేసీ ధ్యానచంద్ర ఆదేశించారు. ఎన్నికలపై కలెక్టరేట్‌లో నోడల్, సెబ్ అధికారులతో ఆయన శనివారం సమీక్షించారు. ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్(ఈఎస్ఎంఎస్) యాప్ ను ప్రతి నోడల్ అధికారీ డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. తనిఖీల్లో పట్టుబడిన నగదు, నగలు, బంగారం, మద్యం, డ్రగ్స్ వివరాలను ఇందులో ఎప్పటికప్పుడు నమోదు చేసి, సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పెంచలకిషోర్, అడిషనల్ ఎస్పీలు రాజేంద్ర, వెంకట్రావు, అసిస్టెంట్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి రవికిరణ్, ఇన్ కంట్యాక్స్ ఆఫీసర్ ఆసీస్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ సీటీఐ సీఏజే ప్రసాద్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

వేసవిని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జేసీ ధ్యానచంద్ర ఆదేశించారు. నీటి సరఫరాకు సంబంధించి సమస్య ఉంటే అప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. నగర పాలక సంస్థ కమిషనర్ అదితిసింగ్, డీపీవో రాజశేఖర్‌రెడ్డి, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు విజయకుమార్, వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

త్రిపుర వర్సిటీ వీసీగా నరసింహరాజు

ఎస్వీయూ రిటైర్డు ఆచార్యుడికి అత్యున్నత పదవి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 30: త్రిపురలోని ఇంటర్నేషనల్ బుద్దిస్ట్ యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ ఎంపీ నరసింహరాజు (డాక్టర్ ముద్దలూరు పెద్ద నరసింహరాజు) నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు వెలువరించింది. ఉమ్మడి కడప జిల్లా రైల్వే కోడూరు ప్రాంతానికి చెందిన ఆయన ఎస్వీ యూనివర్సిటీ సోషియాలజీ విభాగంలో సుదీర్ఘ కాలం ప్రొఫెసర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. సోషియాలజీ హెడ్‌గా, బీఓఎస్ చైర్మన్‌గా, ఎస్వీయూ దూరవిద్యా విభాగం డైరెక్టర్‌గా, ఒంగోలు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌గా పనిచేశారు. ఈ క్రమంలో త్రిపురలో గల ఇంటర్నేషనల్ బుద్ధిస్ట్ యూనివర్సిటీ వీసీగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో త్రిపుర యూనివర్సిటీ వీసీగా నరసింహరాజు బాధ్యతలు స్వీకరించారు.

క్షురకుల సమస్యలు పరిష్కరించే వారికే మద్దతు

తిరుపతి (ఉపాధ్యాయనగర్), మార్చి 30: తిరుమల కల్యాణకట్ట క్షురకుల సమస్యలను పరిష్కరించే వారికే నాయీ బ్రాహ్మణుల మద్దతు ఉంటుందని టీటీడీ మహిళా క్షురకుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు కె.రాధాదేవి స్పష్టం చేశారు. శనివారం ఆమె ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని మారినా నాయీ బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చమని అడిగినందుకు 9 మంది నాయీ బ్రాహ్మణులను కల్యాణకట్ట నుంచి తొలగించారని చెప్పారు. జీతాల పెంపు మాటల్లో ఉందే తప్ప చేతల్లో లేదన్నారు.

ఆత్మీయ సమావేశం పేరుతో

వైసీపీ విందు రాజకీయం

అడ్డుకొన్న ఎన్నికల నిఘా అధికారులు

పుట్టినరోజు వేడుకలంటూ కేక్ కట్‌చేసిన ఎమ్మెల్యే



వైసీపీ నాయకుల నడుమ కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి

సూళ్లూరుపేట, మార్చి 30: సూళ్లూరుపేటలో ఆత్మీయ సమావేశం పేరుతో వైసీపీ విందు రాజకీయానికి తెరలేపింది. దీనికి సంబంధించిన ఏర్పాట్లు కూడా చేశారు. విషయం తెలుసుకొన్న ఎన్నికల నిఘా బృందం అధికారులు అడ్డుకోవడంతో పుట్టిన రోజు వేడుకలంటూ ఎమ్మెల్యే కిలివేటి కేక్ కట్‌చేసి వెళ్లిపోయారు. పట్టణంలోని వ్యాపార వర్గాలతో ఆత్మీయ సమావేశం నిర్వహించేందుకు శనివారం రాత్రి ఓ కల్యాణ మండపంలో వైసీపీ నేతలు ఏర్పాట్లు చేశారు. దీనికి పట్టణంలో అన్ని వ్యాపార వర్గాలకు చెందిన వారందరూ విచ్చేశారు. సమావేశంలో పాల్గొని ఎమ్మెల్యేతో కలిసి విందు భోజనం చేసేందుకు అధికార పార్టీ నాయకులు కూడా వచ్చారు. ఇంతలో ఎన్నికల నిఘా అధికారుల బృందం అక్కడకు చేరుకొని ఆత్మీయ సమావేశాలు నిర్వహించకూడదని అడ్డుకొన్నారు. ఈ విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే కిలివేటి రాత్రి 10గంటల వరకు ఆత్మీయ సమావేశానికి రాలేదు. అధికారులు అక్కడ నుంచి కదలకపోవడంతో రాజకీయ సమావేశం కాదని వ్యాపారస్తులందరూ కార్యక్రమం నిర్వహించుకొంటున్నామని అక్కడున్న అధికార పార్టీ నాయకులు చెప్పారు. వచ్చిన వారందరూ భోజనాలు చేసి వెళ్లిపోయారు. రాత్రి 10 గంటలకు అక్కడకు చేరుకొన్న ఎమ్మెల్యే ఇది పార్టీ కార్యక్రమం కాదని, తెలిసినవారు పుట్టిన రోజు వేడుకలకు పిలిస్తే వచ్చామని అధికారులకు తెలిపారు. అనంతరం కేక్‌కట్ చేసి వెళ్లిపోయారు. అనంతరం అధికారులు కూడా అక్కడ నుంచి వెనుదిరిగారు.

ప్రాణంతీసిన ఈత సరదా

చెరువులో మునిగి వివాహిత మృతి



నాగరాణి మృతదేహం

వరదయ్యపాళెం, మార్చి 30: కుటుంబసభ్యులతో సరదాగా ఈత కొట్టేందుకు చెరువులో దిగిన ఓ గిరిజన వివాహిత నీట మునిగి మృతి చెందింది. ఈ ఘటన వరదయ్యపాళెంలో శుక్రవారం చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి మండలం తెట్టు అరుంధతివాడకు చెందిన పవన్, నాగరాణి(40)దంపతులు ప్లాస్టిక్ వస్తువులు, కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగించేవారు. వీరికి నలుగురు సంతానం. సంచారవృత్తి రీత్యా వరదయ్యపాళెం గిరిజనకాలనీలో నివాసం ఉంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం పిల్లలు, బంధువులతో సహా కాలనీ సమీపంలోని అర్దూరు చెరువులో ఈతకు వెళ్లారు. కొంతసేపటి తరువాత పిల్లలు, బంధువులు ఇంటికి వెళ్లగా పవన్, నాగరాణి చెరువులోనే కొంతమయం గడిపారు. తర్వాత పవన్ దుస్తులు ఆరబెట్టడానికి గట్టుకు చేరాడు. ఆ సమయంలో నాగరాణి బురదలో చిక్కుకుని నీట మునిగిపోయింది. పవన్‌కు ఈత రాకపోవడంతో కాలనీకి వెళ్లి బంధువులను తీసుకొచ్చేసరికి ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, అంత్యక్రియలు ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఏఎస్‌ఐ షణ్ముగం తన వంతు సాయం అందించారు.

వైసీపీ ప్రచార సామగ్రి నిల్వపై ఫిర్యాదు

గోదాముల నిర్వాహకులు నలుగురిపై కేసు

రేణిగుంట, మార్చి 30: వైసీపీ ప్రచార సామగ్రి భారీ ఎత్తున నిల్వ చేసిన మూడు గోదాముల నిర్వాహకులు నలుగురిపై కేసు నమోదయ్యింది.రేణిగుంట మండలం పాత విమా నాశ్రయ రోడ్డులోని మూడు గోదాముల్లో పెద్ద ఎత్తున వైసీపీ ప్రచార, ప్రభావిత సామగ్రి మూడురోజుల క్రితం బయటపడిన విషయం తెలిసిందే.టీడీపీ నాయకుల ఆందోళనతో ప్రచార సామగ్రిని సీజ్ చేసిన అధికారులు శుక్రవారం కలెక్టర్ అనుమతితో తరలించడానికి అనుమతించారు. కాగా వైసీపీ ప్రచార, ప్రభావిత సామాగ్రిని భద్రపరచిన గోదాముల నిర్వాహకులపై రేణిగుంట ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి సలోమి శనివారం గాజులమండ్యం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.దీంతో ప్రచార సామగ్రిని కొనుగోలు చేసిన సుమన్, గోడౌన్‌లో ప్రచార సామగ్రి ఇన్‌ఛార్జులు అనిల్, రమేష్‌రెడ్డి, గోదాము ఇన్‌ఛార్జి రవికుమార్‌పై 188వ సెక్షన్ కింద కేసు నమోదు చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సుబ్బారాయుడు తెలిపారు. అలాగే రేణిగుంట అర్బన్ పోలీసు స్టేషన్లో కూడా గోదాముల నిర్వాహకులు సుమన్,ప్రచార సామగ్రి ఇన్‌ఛార్జులు అనిల్, రమేష్‌రెడ్డిలపై కేసు నమోదు చేశారు.

త్రిపుర వర్సిటీ వీసీగా నరసింహరాజు

ఎస్వీయూ రిటైర్డు ఆచార్యుడికి అత్యున్నత పదవి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 30: త్రిపురలోని ఇంటర్నేషనల్ బుద్ధిస్ట్ యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ ఎంపీ నరసింహరాజు (డాక్టర్ ముద్దలూరు పెద్ద నరసింహరాజు) నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు వెలువరించింది. ఉమ్మడి కడప జిల్లా రైల్వే కోడూరు ప్రాంతానికి చెందిన ఆయన ఎస్వీ యూనివర్సిటీ సోషియాలజీ విభాగంలో సుదీర్ఘ కాలం ప్రొఫెసర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. సోషియాలజీ హెడ్‌గా, బీఓఎస్ ఛైర్మన్‌గా, ఎస్వీయూ దూరవిద్యా విభాగం డైరెక్టర్‌గా, ఒంగోలు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌గా పనిచేశారు. ఈ క్రమంలో త్రిపురలో గల ఇంటర్నేషనల్ బుద్ధిస్ట్ యూనివర్సిటీ వీసీగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో త్రిపుర యూనివర్సిటీ వీసీగా నరసింహరాజు బాధ్యతలు స్వీకరించారు. పలువురు ఆయన్ను అభినందించారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

నాయుడుపేట టౌన్, మార్చి 30: మహిళ మెడలో బంగారు గొలుసు అపహరించుకుపోయిన ఘటన నాయుడుపేట పట్టణంలోని మునిరత్నం నగర్ కాలనీ సమీపంలో జరిగింది. బాధితుల కథనం మేరకు లక్ష్మీపతి, విజయలక్ష్మి దంపతులు పట్టణంలోని టీ దుకాణం నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి దుకాణాన్ని మూసివేసి భార్య, భర్తలిద్దరూ మోటారు సైకిల్‌పై తాము నివాసముండే మునిరత్నం కాలనీకి బయలుదేరారు. కాలనీ దగ్గరకు వెళ్లగానే ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వచ్చి విజయలక్ష్మి మెడలో ఉన్న మూడు సవర్ల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనొద్దు

కోట, మార్చి 30: రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనవద్దని తహసీల్దారు నాగరాజరావు అన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎన్నికల నియమావళిపై రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లపై నిఘా ఉంటుందని, నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

కోట, మార్చి 30: కోట నుంచి గూడలిలోని బెల్టు దుకాణానికి తరలిస్తున్న 30 మద్యం బాటిళ్లను ఎస్‌ఐ నాగబాబు స్వాధీనం శనివారం చేసుకున్నారు. నిందితుడు ప్రవీణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గ్యాస్ ఏజన్సీ కార్యాలయంలో చోరీ

దొరవారిసత్రం, మార్చి 30: దొరవారిసత్రం మండలం కుప్పారెడ్డిపాళెం వద్ద ఉన్న భారత్ గ్యాస్ ఏజన్సీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. కార్యాలయ తలుపులు పగలకొట్టి మూడు కంప్యూటర్లు, రెండు ప్రింటర్లు, రూ.42వేల నగదు ఎత్తుకెళ్లినట్లు ఏజన్సీ నిర్వాహకుడు సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు చోరీ

దొరవారిసత్రం, మార్చి 30: మండలంలోని మేలుపాక గ్రామం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు, ఆయిల్‌ను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ట్రాన్స్‌కో ఏఈ జగదీష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మత్స్యకారులను ఆదుకుంటాం: చంద్రబాబు



ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు, ప్రసంగిస్తున్న విజయశ్రీ

నాయుడుపేట/తడ, మార్చి 30: పులికాట్ సరస్సును నమ్ముకొని ఉన్న మత్స్యకారులను అన్ని విధాలుగా ఆదుకుంటామని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. శనివారం సాయంత్రం నాయుడుపేట పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన ప్రజాగళం బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పులికాట్ ముఖద్వారాల వద్ద పూడికతీయించి మత్స్య సంపద సంవృద్ధిగా దొరికేలా కృషి చేస్తామన్నారు. అంతేకాకుండా వలలు, సబ్సిడీ డీజల్ వంటి పథకాలను చేరువ చేస్తామని చెప్పారు. స్వర్ణముఖి, కాళంగి నదుల ఇసుక ఎమ్మెల్యే కిలివేటికి ఏటీఎంగా మారిందన్నారు. ఇసుకంతా దోచేసినా చాలక గంజాయి, గ్రావెల్ దందా, అక్రమ బియ్యం, లిక్కర్ దందాల్లోనూ ఎమ్మెల్యే భాగస్తుడుగా మారారని దుయ్యబట్టారు. శ్రీసిటీ సెజ్‌కు తాను పరిశ్రమలు తెస్తే... కిలివేటి సంజీవయ్య పేకాట క్లబ్‌లు తెచ్చారని విమర్శించారు. ఆయన అవినీతితో ఇసుక మొత్తం మాయమై భూగర్భజలాలు అడుగంటిపోయాయని, నేడు తాగడానికి మంచినీళ్లు సైతం లేక మీరు ఇబ్బందులు పడుతున్నది నిజమే కదా అని ప్రజలనుద్దేశించి అన్నారు. ఈ పదేళ్లల్లో ఒక్క చిన్న అభివృద్ధి పని అయినా మీ ఎమ్మెల్యే చేశాడా అని స్థానికులను ప్రశ్నించారు. చెత్త మీద పన్నువేసిన ఈ ముఖ్యమంత్రికి ప్రజలు గుణపాఠం చెప్పాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. చంద్రబాబు వెంట సూళ్లూరుపేట, గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థులు నెలవల విజయశ్రీ, పాశం సునీల్‌కుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి పరసారత్నం, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, జనసేన నాయకుడు ఉయ్యాల ప్రవీణ్, టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, వేనాటి సతీష్‌రెడ్డి, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, కందల కృష్ణారెడ్డి, రఫీ తదితరులు ఉన్నారు.

చంద్రబాబుకు ఘనస్వాగతం



హెలిప్యాడ్ వద్ద చంద్రబాబు కోసం ఎదురుచూస్తున్న టీడీపీ నాయకులు

నాయుడుపేట/టౌన్, మార్చి 30: ప్రజాగళం బహిరంగ సభకు విచ్చేసిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. హెలిప్యాడ్ వద్ద ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం. మాజీ మంత్రి పరసారత్నం, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, జనసేన ఇన్‌ఛార్జి ఉయ్యాల ప్రవీణ్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ రఫీ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కందల కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు కామిరెడ్డి అశోక్‌రెడ్డి, తెలుగు యువత కార్యదర్శి శోభన్‌నాయుడు, డాక్టర్ సందీప్ తదితరులు స్వాగతం పలికారు.

ప్రజాగళం విజయవంతం

నాయుడుపేట/తడ, మార్చి 30: నాయుడుపేట పట్టణంలో శనివారం ప్రజాగళం సభ విజయవంతమైంది. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రసంగం కార్యకర్తలు, ప్రజలను ఉత్సాహపరిచింది. తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రూ.60 ఉన్న మద్యం బాటిల్ ప్రస్తుత ధర రూ.200 కదా తమ్ముళ్లూ అని చంద్రబాబు ప్రశ్నించగా జనం ఔను అంటూ చేతులు ఊపారు. ఈ సైకో ప్రభుత్వం మనకు అవసరమా అన్న మాటకూ జనం విపరీతంగా స్పందించారు. ఇలా పలుమార్లు జనంతో ఆయన సమాధానాలు చెప్పించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. సాయంత్రం 4.10 నిమిషాలకు ప్రసంగం మొదలుపెట్టిన చంద్రబాబు గంటపాటు ఏకధాటిగా ప్రసంగిస్తూ సభికులను ఉర్రూతలూగించారు.









తిరుమల ఘాట్‌లో ప్రమాదం

చెట్టును ఢీకొన్న కారు: బెంగళూరు భక్తురాలి మృతి



భవాని మృతదేహం



ప్రమాదానికి గురైన కారు

తిరుమల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ భక్తురాలు మృతి చెందింది. మరో భక్తుడికి తీవ్ర గాయాలు కాగా ముగ్గురు పిల్లలు స్వల్పగాయాలతో బయటపడ్డారు. బెంగళూరుకు చెందిన మురళీధర్, భవాని దంపతులు పదిమంది కుటుంబ సభ్యులతో మూడు కార్లలో శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చారు.శనివారం సాయంత్రం 6 గంటలకు తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు.మురళీధర్, భవానీ,వారి ఇద్దరు పిల్లలు ప్రజ్వల్, నిసర,మురళీధర్ అన్న కుమార్తె రక్షితతో కలిసి సాంత్రో కారులో తిరుమల నుంచి బయలుదేరారు. ఏనుగుల ఆర్చి దాటిన తర్వాత కారు అదుపుతప్పి ఎడమవైపున్న అడవిలోకి దూసుకెళ్లి చెట్టును ఢీకొంది. వెనుకవస్తున్న కుటుంబ సభ్యులు, ఇతర ప్రయాణికులు, ప్రమాదానికి గురైన కారులోని మురళీధర్ దంపతులను, పిల్లలను వెలుపలకు తీసుకువచ్చారు. అంబులెన్స్ ద్వారా తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తీసుకురాగా, వైద్యులు పరిశీలించి భవాని అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. కారు ముందు సీట్లో ఉన్న భవాని తల గట్టిగా డ్యాష్‌బోర్డుకు కొట్టుకోవడంతో అక్కడికక్కడే మృతిచెందినట్టు వైద్యులు అభిప్రాయపడ్డారు.పిల్లలు స్వల్ప గాయాలతో బయటపడగా, డ్రైవింగ్ చేస్తున్న మురళీధర్ తీవ్రంగా గాయపడ్డారు.టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఆస్పత్రికి చేరుకుని మెరుగైన చికిత్స కోసం మురళీధర్‌ను తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రికి తరలించారు. నిద్రమత్తే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని భద్రతా సిబ్బంది అనుమానం వ్యక్తపరుస్తున్నారు.

సుగుణమ్మా... కలిసి పనిచేయాల్సిందేనమ్మా!

- నాయకులందరూ కూటమి అభ్యర్థి విజయానికి సహకరించాలి
- మీ భవిష్యత్ నేను చూసుకుంటా
- తిరుపతి నేతలకు చంద్రబాబు దిశా నిర్దేశం



తిరుపతి నాయకులతో మాట్లాడుతున్న చంద్రబాబు

తిరుపతి, మార్చి30(ఆంధ్రజ్యోతి): 'పొత్తులో భాగంగా తిరుపతి సీటు జనసేనకు కేటాయించాం. పెద్ద కేడర్ ఉండేచోట టికెట్ మనకు లేకపోవడం నాకు కూడా బాధగా ఉంది. సుగుణమ్మా...మీకు ఇదివరకే చెప్పాను కదా! కలిసి పనిచేయాల్సిందేనని, మీ భవిష్యత్తు నేను చూసుకుంటా' అంటూ టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శ్రీకాళహస్తిలో శనివారం జరిగిన ప్రజాగళం కార్యక్రమం అనంతరం తిరుపతి నేతలు ఆయనతో భేటీ అయ్యారు. కూటమి అభ్యర్థి విజయం కోసం అందరూ కలసి పనిచేయాల్సిందేనని, 2019లో కూడా గెలిచిన సీటును వాళ్లు ప్రకటించుకున్నారని అన్నారు. తిరుపతిలో వైసీపీ నేతల అరాచకంపై వ్యతిరేకత ఉందని, అందరూ కూర్చుని మాట్లాడుకుని కలిసి పనిచేయాలని, మళ్లీ తాను ఫోన్ చేసేలా చేసుకోవద్దని, పేరుపేరునా పిలిచి దిశానిర్దేశం చేశారు. పదేపదే సుగుణమ్మను ఉద్దేశించి చెప్పడంతో ఆమె కంటతడి పెట్టుకుని ఆయన పాదాలకు నమస్కారం చేశారు. చంద్రబాబును కలిసిన వారిలో నరసింహ యాదవ్, చిట్టిబాబు, ఊకా విజయకుమార్, ఆర్సీ మునికృష్ణ, జేబీ శ్రీనివాస్, పులుగోరు మురళి, దంపూరి భాస్కర్, బుల్లెట్ రమణ, పుష్పావతి, ఊట్ల సురేంద్ర నాయుడు, చినబాబు, మహేష్ యాదవ్, కంకణాల రజినీకాంత్, మునిశేఖర్ రాయల్, బ్యాంకు శాంతమ్మ, ఆర్సీ శ్రీనివాసులు, సుబ్బుయాదవ్, కొట్టే హేమంత్ రాయల్ తదితరులు ఉన్నారు.

అసలీ ఎమ్మెల్వో ఎవరు?

వలంటీర్లను రాజీనామా చేయమనడంపై విచారణ

వరదయ్యపాళెం, మార్చి 30:రాజీనామా చేసి వైసీపీ తరఫున ప్రచారంలో పాల్గొనండి...పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చాక మిమ్మల్నే విధుల్లోకి తీసుకుంటాం అంటూ వలంటీర్లపై ఒక మండల లెవల్ ఆర్గనైజర్ (ఎమ్మెల్వో) ఒత్తిడి చేయడంపై శనివారం పత్రికల్లో వెలువడిన కథనాలు వరదయ్యపాళెం మండలంలో కలకలం రేపాయి. అసలు ఈ ఎమ్మెల్వో చంద్ర ఎవరనే విషయంపై చర్చ నడిచింది. పత్రికా కథనాలపై ఎంసీసీ(మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అధికారి చిరంజీవి స్పందించి ఆ వలంటీర్లు పనిచేసే సచివాలయ అధికారి బసిరెడ్డికి విచారణ జరపాలని నోటీసు పంపారు.వలంటీర్లను పిలిపించి బసిరెడ్డి వివరణ కోరగా ప్రతి పథకం అమలు చేసే సమయంలో ఎమ్మెల్వో చంద్ర పెట్టే గ్రూప్ మీటింగుల మాదిరిగానే ఈ నెల 28వ తేదీ సాయంత్రం 6గంటల సమయంలో ఫోన్ చేసి డేటా అడగ్గా కొంతమంది స్పందించి వివరాలు చెప్పామన్నారు. ఎప్పుడూ జరిగే కార్యక్రమమే కదా అని స్పందించామంటూ వలంటీర్లు వివరణ ఇచ్చారు. ఈ సమాచారాన్ని ఇన్‌ఛార్జి ఎంపీడీవో అనసూయకు, ఎంసీసీ అధికారి చిరంజీవికి కార్యదర్శి బసిరెడ్డి తెలిపారు.వారు ఆ నివేదికను తిరుపతి డీఎల్డీవో, జీఎస్ డబ్ల్యూ కార్యాలయ అధికారులకు పంపించారు. అసలు ఈ ఎమ్మెల్వో చంద్ర ఎవరు? ఆయన్ను ఎవరు నియమించారు? ఎక్కడ ఉంటారు? తెలుసుకుని కేసు నమోదు చేయిస్తామని చిరంజీవి, అనసూయ తెలిపారు.

ఇద్దరు రుయా ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

తప్పుడు రిపోర్టులు ఇచ్చిన ఫలితం

తిరుపతి (వైద్యం), మార్చి 30: వైద్యం కోసం వచ్చిన రోగికి హెచ్ఐవీ అంటూ తప్పుడు రిపోర్టులు ఇచ్చిన ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ రుయాస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభు శనివారం ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదంలో కాలికి గాయమైన ఓ యువకుడు పది రోజుల కిందట వైద్యం కోసం రుయాస్పత్రికి వచ్చాడు. వైద్యుల సూచన మేరకు ల్యాబ్‌లో రక్త పరీక్షలు చేయించుకోగా హెచ్ఐవీ పాజిటివ్ అని తప్పుడు రిపోర్టులు ఇచ్చారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితం కావడంతో రుయా సూపరింటెండెంట్ రవిప్రభు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి తప్పుడు రిపోర్టులు ఇచ్చిన ల్యాబ్ టెక్నీషియన్ బి.రాజశేఖర్ నాయక్, ల్యాబ్ అటెండరు ఎస్.రమణ మోహన్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. విచారణ కొనసాగుతోందని, పూర్తయ్యే వరకు అందుబాటులో ఉండాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ల్యాబ్‌ను పూర్తిస్థాయిలో పర్యవేక్షించాల్సిన మైక్రోబయాలజీ విభాగాధిపతి, డాక్టర్లను తప్పించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. సాధారణంగా ల్యాబ్ నుంచి వచ్చే ప్రతి రిపోర్టును ల్యాబ్ విభాగాధిపతి లేదా సంబంధిత డాక్టర్లు పరిశీలించిన తర్వాతనే రోగులకు అందించాలి.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



వడమాలపేట, మార్చి 30: అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజలసేవ వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వరస్వామిని సర్వాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించి వేదమంత్రాలు, భక్తులు గోవిందనామ స్మరణల నడుమ శ్రీవారి ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన పద్మావతీ అండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామిని మేళతాలలు, మంగళ వాయిద్యాల నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

వలంటీర్ సస్పెన్షన్

పుత్తూరు అర్బన్, మార్చి 30: ఉత్తరపు కండ్రిగ పంచాయతీకి చెందిన వలంటీర్ నవన్‌ను సస్పెండ్ చేస్తూ ఎంపీడీవో ప్రసాద్ శనివారం ఉత్వర్వులు ఇచ్చారు. మండల పరిధిలోని తొరూరులో శుక్రవారం వలంటీర్ నవీన్ వైసీపీ కండువా కప్పుకుని ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. దీనిపై పత్రికల్లో వార్త ప్రచురితం కావడంతో అధికారులు విచారణ జరిపి వలంటీర్‌ను సస్పెండ్ చేశారు.

పాలిసెట్ పరీక్షకు ఉచిత శిక్షణ

పుత్తూరు, మార్చి 30: పాలిసెట్ 2024 ప్రవేశ పరీక్ష రాసే అభ్యర్థుల కోసం ఏప్రిల్ 1వ తేదీ నుంచి కళాశాలలో ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నామని పుత్తూరులోని పిళారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు శిక్షణ తరగతుల్లో చేరవచ్చన్నారు. వివరాలకు 90102 22155 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పండి



లక్ష్మీప్రసన్న, హేమావతి

వడమాలపేట, మార్చి 30: వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెపాల్సని చిత్తూరు పార్లమెంటు తెలుగు మహిళా కార్యదర్శి లక్ష్మీప్రసన్న, మండల ప్రధాన కార్యదర్శి హేమావతి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ మద్య నిషేధం అమలు చేస్తామని చెప్పి మడమ తిప్పారని, ప్రత్యేక హోదాను గాలికొదిలేశారని, 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారని, డీఎస్సీ నిర్వహించికుండా నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. రాష్ట్ర భవిష్యత్తును కాంక్షించి త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని తెలుగు మహిళలు కోరారు.

టీడీపీలోకి వలసలు



టీడీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, మార్చి 30: నారాయణవనం మండలానికి చెందిన పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. శనివారం ఉదయం సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం సమక్షంలో కళింమిట్ట ఎంపీటీసీ ధనలక్ష్మి, మాజీ సర్పంచు వెంకటేష్, సీనియర్ నాయకులు సుబ్రరాయలు, శ్రీనివాసులు, బొప్పరాజపాలెం గ్రామానికి చెందిన పలు కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారందరికీ ఆదిమూలం పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కరన్, మాజీ ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం, నాయకులు కృష్ణయ్య, మునిరత్నం, కిరణ్‌కుమార్, తులసి, సుభద్ర, గోవిందయ్య, గోవిందస్వామి, రవి, హరి, మాణిక్యం రెడ్డి, శివకుమార్, గోవిందశెట్టి, విజయ్‌కుమార్, పురుషోత్తం, సొరకాయలు పాల్గొన్నారు.

గెజిట్ మేరకే రుసుం వసూలు చేయండి



వినతిపత్రం సమర్పిస్తున్న వీధి విక్రయదారుల సంఘం నాయకులు

పుత్తూరు అర్బన్, మార్చి 30: ప్రభుత్వం ఆమోదించిన గెజిట్‌లో పేర్కొన్న మేరకే చిరువ్యాపారుల నుంచి గేటు రుసుం వసులు చేయాలని వీధి విక్రయదారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మురగారెడ్డి కోరారు. శనివారం మున్సిపల్ అధికారులకు ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెజిట్‌లో నిర్దేశించిన మేరకే కాంట్రాక్టరు గేటు రుసుం వసూలు చేయాలని, లేకుంటే విక్రయదారులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. అంతకు మునుపు వీధి విక్రయదారుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.వరప్రసాద్, ఉపాధ్యక్షుడిగా ఎన్.వెంకటరమణయ్య, ప్రధాన కార్యదర్శిగా కే.మురగారెడ్డి, సహాయ కార్యదర్శిగా ఎం.అంకయ్య(చిన్న), కోశాధికారిగా రాజేంద్రనాయుడు, సభ్యులుగా తులసీనాథ్, మునిరత్నం, జయ, మునెమ్మ, నీల, లావణ్య, రాజేశ్వరి, ముత్తురామన్, జి.లావణ్య, కే.ప్రసాద్ తదితరులు ఎంపికయ్యారు.

ఆటోవర్కర్స్ గేటు రుసుం రద్దు చేయండి

పుత్తూరు టౌన్, మార్చి 30: పుత్తూరు మున్సిపాలిటీలోని ఆటో వర్కర్స్‌కు గేటు రుసుం వసూలు రద్దు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఎక్కడా లేనివిధంగా పుత్తూరులో మాత్రమే గేటు రుసుం వసూలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నేత భాస్కర్, ఆటో వర్కర్స్ జిల్లా కార్యదర్శి పురుషోత్తం, బాషా, బాబు, చంటి, కృష్ణయ్య, ధన తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

చంద్రబాబును కలసిన ఆదిమూలం



సత్యవేడు, మార్చి 30: నాయుడుపేటలో శనివారం జరిగిన ప్రజాగళం సభ సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబును సత్యవేడు టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆది మూలం మర్యాదపూర్వకంగా కలిశారు. సత్యవేడు టీడీపీ అభ్యర్థిగా అవకాశం కల్పించినందుకు చంద్రబాబుకు ఆదిమూలం కృతజ్ఞతలు తెలిపారు. సమన్వయమే ప్రధాన ఆయుధంగా అందరినీ కలుపుకుని మరింత వేగంగా ముందు కెళ్లాలని చంద్రబాబు తనకు సూచించినట్లు ఆదిమూలం తెలిపారు.

వైసీపీ ప్రచారంలో వలంటీరు



ప్రచారంలో ఫొటో దిగిన వలంటీరు

రేణిగుంట, మార్చి 30: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీలోని గుండ్రాలకాల్వ, సీఆర్ నగర్, చైతన్యపురంలో శుక్రవారం ఎమ్మెల్యే సతీమణి శ్రీవాణి నిర్వహించిన ప్రచారంలో వలంటీరు రాజేంద్ర పాల్గొన్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ఇతడు పాల్గొనడం శనివారం వెలుగులోకి వచ్చింది.

వలంటీరు ఈశ్వరమ్మపై వేటు

ఏర్పేడు, మార్చి 30: మండలంలోని పంగూరు పంచాయతీ కాట్రకాయల గుంట గ్రామానికి చెందిన వలంటీరు ఈశ్వరమ్మ తన భర్తతో కలిసి టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆమెను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో గిడ్డయ్య తెలిపారు.

టీడీపీ గెలవాలని మోకాళ్లపై వేయి లింగాలకోనకు



మోకాళ్లపై మెట్లు ఎక్కుతున్న మునికృష్ణ

శ్రీకాళహస్తి, మార్చి 30: చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా బొజ్జల సుధీర్‌రెడ్డి విజయం సాధించాలని శ్రీకాళహస్తి 24వ వార్డు ఇన్‌చార్జి, మాజీ కౌన్సిలర్ భీమాల మునికృష్ణ సంకల్పించారు. ఈ మేరకు శ్రీకాళహస్తి మండలం వేడాం సమీపం లోని వేయి లింగాల కోన మెట్లను మోకాలిపై ఎక్కి అక్కడి శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థులు నవసమాజ నిర్మాతలుగా ఎదగాలి



దాతను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వరదయ్య పాళెం, మార్చి 30: విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరి నవ సమాజ నిర్మాతలు కావాలని ప్రధానో పాధ్యాయుడు రమ ణయ్య పిలుపు నిచ్చారు. శనివారం వరదయ్య పాళెం జడ్పీ ఉన్నత పాఠశాల 65వ వార్షికోత్సవ వేడుకలను వ్యాయామ ఉపాధ్యాయుడు కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి కోసం సామాజిక సేవా దృక్పథంతో సాయం అందించిన దాతలు జానకీరామ్ యాదవ్, వెంకటేశ్వర్లు, టీడీపీ యువజన నాయకుడు, ఎన్ఆర్ఐ నందకిషోర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం క్రీడాపోటీలలో సత్తాచాటిన విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అంద జేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

సత్యవేడు, మార్చి 30: సత్యవేడు మండలంలో నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి గుణశేఖర్ కోరారు. శనివారం కాళమనాయు డుపేట పాఠశాల ప్రాంగణంలో ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరీ లోకేష్ పర్యవేక్షణలో ఆరోగ్య సురక్ష రెండో విడత శిబిరం నిర్వహించారు. ఇందులో చిన్న పిల్లల వైద్యనిపుణులు వాసు, కంటి వైద్య సహాయకుడు దాము తదితరుల బృందం రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. రోగులకు ఎంపీహెచ్‌వో సుబ్ర హ్మణ్యం, పంచాయతీ సెక్రటరీ లోకేష్ మందులను అందించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నాగజ్యోతి, అసిస్టెంట్ షణ్ముగం, ఫార్మసిస్టు భార్గవి, ఏఎన్ఎంలు రోసులిన్, ఇంద్రాణి, సరస్వతి, యమున, స్వాతి, సుమలత, ఎంఎల్‌హెచ్‌పీ సుప్రియ, ఆశ వర్కర్లు సుజాత, సిద్ధమ్మ పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన ఏర్పేడు టీడీపీ నాయకులు



ఏర్పేడు, మార్చి 30: ఏర్పేడు మండలానికి చెందిన జడ్పీటీసీ తిరుమ లయ్య, టీడీపీ యువనేత కన్నలి మోహన్‌రెడ్డి శనివారం శ్రీకాళహస్తిలోని ఆ పార్టీ కార్యాలయంలో చంద్ర బాబును కలిశారు. ఆయనను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించారు.

భక్తులకు నాణ్యమైన భోజనం అందించాలి

శ్రీకాళహస్తి, మార్చి 30 భక్తులపై నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని ముక్కంటి ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు కోరారు. శనివారం ఆయన ఆలయంలోని నిత్యాన్నదానంలో అన్నప్రసాదాలను పరిశీలించారు. భక్తులతో కలిసి భోజనం చేశారు. భక్తులతో, సిబ్బందితో కలిసి మాట్లాడారు. భక్తులకు అసౌకర్యం లేకుండా అన్నప్రసాదం అందించాలని కోరారు.

ప్రజాగళానికి తరలిన తెలుగు తమ్ముళ్లు



రేణిగుంట నుంచి బయలుదేరిన కార్యకర్తలు

రేణి గుంట, మార్చి 30: శ్రీకాళ హస్తిలో చంద్ర బాబు చేపట్టిన ప్రజా గళం బహిరంగ సభకు రేణిగుంటకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణా ధ్యక్షుడు మహబూబ్‌బాషా, పుష్పనాథన్, కన్నన్‌రెడ్డి, సంపత్, రవి, మురళి, కిరణ్, గజేంద్ర, నాగేశ్వరరావు, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: ఏర్పేడు మండలంలోని చిందేపల్లి, పాగాలి, పెనగడం తదితర పంచాయతీల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున ప్రజాగళం సభకు తరలివెళ్లారు.



పెనగడం నుంచి బయలుదేరిన నాయకులు, కార్యకర్తలు

ఆదర్శ పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

కేవీబీపురం, మార్చి30: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు తేదీని ఏప్రిల్ 6వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి వెల్లడించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని పత్రాలను పాఠశాలలో అందించాలని కోరారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21వ తేదీన ఉంటుందని వివరించారు.

శనీశ్వర స్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, మార్చి 30: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనీశ్వర స్వామికి విశేష పూజలు జరిగాయి. శనివారం పురస్కరించుకుని ముందుగా అర్చకులు స్వామి సన్నిధిని శుద్ధి చేశారు. భక్తుల నుంచి సంకల్పం స్వీకరించారు. వివిధ పూజా ద్రవ్యాలతో పాటు శని ప్రీతి కోసం విశేషంగా తైలాభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించి విశేషాలంకారంతో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

రిటైరైన టీచర్లకు సన్మానం



వరదయ్యపాళెం, మార్చి 30: మండలంలోని కారిపాకం యానాది కాలనీలో ఉన్న ఎంపీపీ పాఠశాలలోని ఉపాధ్యాయులు సింహాద్రి, జగదాంబ ఉద్యోగ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో శనివారం స్థానిక ఎమ్మార్సీ ఆవరణంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-1 సరస్వతి, ఎంఈవో-2 గున్నయ్య, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసన్న వెంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 30: మండల కేంద్రంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామికి శనివారం భక్తులు ప్రత్యేకపూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా భజన కార్యక్రమం, పండరి భజన ఆకట్టుకుంది. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

4న శ్రీకృష్ణ మందిర కుభాభిషేకం

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 30: మండలంలోని పార్లపల్లి గ్రామంలో నిర్మిస్తున్న శ్రీకృష్ణ మందిర కుంభాభిషేకం ఏప్రిల్ 4న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. మూడు రోజులు పాటు ఈ కుంభాభిషేకం మహోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు.

తాగునీటి సమస్య తీర్చండి



కేవీబీపురం, మార్చి30: మండలంలో కొత్తూరు గ్రామంలో తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారు. ఉన్న రెండు చేతి బోర్లు పాడైపోయాయి. విద్యుత్ బోరుకు సంబంధించిన పైపులైన్లు దెబ్బతినడంతో ట్యాంకుకు నీరు చేరడం లేదు. ఫలితంగా మోటర్ వద్ద నేరుగా నీటిని పట్టుకోవడానికి మహిళలు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి బోర్లు, పైపులైన్లు బాగు చేయించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

పాలీసెట్‌కు ఉచిత శిక్షణ

సత్యవేడు, మార్చి 30: సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో పాలిసెట్ పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ ఉషాదేవి వెల్లడించారు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు అందరూ శిక్షణకు అర్హులన్నారు. ఏప్రిల్ 1 నుంచి 25వ తేదీ వరకు ఉచిత శిక్షణ జరుగుతుందని తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఈ ఉచిత శిక్షణను పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులందరూ సద్వినియోగం కోవాలని కోరారు. వివరాల కోసం 7780319955, 8179433557 మొబైల్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

రాక్షసుడి అంతం ఆసన్నం: సుధీర్





ప్రజాగళం సభలో పసుపు జెండా రెపరెపలు, ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 30: శ్రీకాళహస్తిని రాక్షసుడిగా పీడిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిని అంతం చేసే సమయం ఆసన్నమైందని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం చంద్రబాబు నిర్వహించిన పజాగళం సభలో ఆయన మాట్లాడుతూ శ్రీకాళ హస్తి ఎమ్మెల్యే అరాచకాలపై నిప్పులు చెరిగారు. తన తండ్రి మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి అభివృద్ధికి మారు పేరుగా శ్రీకాళ హస్తికి కీర్తిని తెచ్చారని గుర్తుచేశారు. ఐదేళ్ల పాలనలో మధుసూదన్‌రెడ్డి దందాలు, రౌడీ యిజం, గూండాయిజం, భూకబ్జాలు, ల్యాండ్ మాఫియా, శాండ్ మాఫియాతో జనాన్ని పీడించారని మండిపడ్డారు. టీడీపీ తీసుకువచ్చిన పరిశ్రమల యజమానులను బెదిరించి ఏటీఎం లుగా వాడుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం నకిలీ బోగస్ ఇంటి పట్టాలతో జనాలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. శ్వేత పత్రం అంటే కనీసం అవగాహన లేని అజ్ఞాని ఎమ్మెల్యే అని దుయ్యబట్టారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ముక్కంటి ఆలయాన్ని ప్రక్షాళన చేయాలని, ప్రభుత్వా స్పత్రికి, స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలకు పూర్వ వైభవం తీసుకురావాలని చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. అలాగే టీడీపీ నాయకులపై, కార్యకర్తలపై అక్రమ కేసులను కొట్టివేయాలని, స్థానిక యువతకు పరిశ్రమల్లో 33శాతం ఉద్యోగాలు కల్పించాలని, ఎన్టీఆర్ గృహాలను పంపిణీ చేయాలని కోరారు. తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ మాట్లాడుతూ అహంకారంతో, కుల వివక్షతో సీఎం జగన్ పాలన సాగుతోందని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అరాచకాలతో అభివృద్ధి 25 ఏళ్ల వెనక్కి వెళ్లిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో వైసీపీ అరాచాక పాలనకు స్వస్తి పలకాలని కోరారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత మాట్లాడుతూ ఎమ్మెల్యే మధు అనే రాక్షసుడు నుంచి శ్రీకాళహస్తిని కాపాడుకోవాలని విజ్ఞప్తిచేశారు. బొజ్జల బృందమ్మ మాట్లాడుతూ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు ఖాయమన్నారు. అందుకు దేవుడి ఆశీస్సులు ఉన్నాయన్నారు. బొజ్జల రిషితారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత శ్రీకాళహస్తిలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శ్రీకాళహస్తిని గంజాయి వనంగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మే 13వ తేదీని సెలవు రోజుగా ఎవరూ భావించరాదని అది భవిష్యత్తును నిర్ణయించే రోజుగా భావించి అందరూ ఓటు హక్కును ఉపయోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, సత్రవాడ ముని రామయ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతినాయుడు, గురవారెడ్డి, నాయకులు విజయ్‌కుమార్, మునిరాజా నాయుడు, రాంబాబు నాయుడు, కంఠా రమేష్, బీజేపీ జిల్లా అధ్యక్షులు చంద్రప్ప, జనసేన జిల్లా కార్యదర్శి కొట్టేసాయి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడిన నలుగురు ఎంపీటీసీలు





మడిబాక ఎంపీటీసీ పద్మమ్మకు, కోబాక ఎంపీటీసీ గౌరికి కండువా కప్పిటీడీపీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు





చెల్లూరు ఎంపీటీసీ రాధకు, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్‌యాదవ్‌ను ఆహ్వానిస్తున్న చంద్రబాబు

ఏర్పేడు, మార్చి 30: ఏర్పేడు మండలంలో అధికార పార్టీకి ఎదురుదెబ్బ తగలింది. వైసీపీ నుంచి నలుగురు ఎంపీటీసీలు టీడీపీలో చేరారు. మడిబాక ఎంపీటీసీ పద్మమ్మ, కోబాక ఎంపీటీసీ నూతలసపాటి గౌరి, చెల్లూరు ఎంపీటీసీ రాధ, అంజిమేడు ఎంపీటీసీ బొడుగు శ్రీనివాసయాదవ్ చంద్రబాబు సమక్షంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం శ్రీకాళహస్తిలోని టీడీపీ కార్యాలయంలో చంద్ర బాబు వారి కందు వాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా ఆమందూరు మాజీ ఎంపీటీసీ, ఏర్పేడు మండలం యాదవ సంఘం అధ్యక్షులు ఊటి చంద్రశేఖర్ యాదవ్ వైసీపీని వీడి చంద్ర బాబు సమక్షంలో టీడీపీలో చేరారు. సుధీర్‌రెడ్డి విజయానికి అందరూ కృషిచేసి గెలిపించాలని చంద్రబాబు వారిని కోరారు.

టీడీపీలోకి 73 దళిత కుటుంబాలు



టీడీపీ చేరిన వారితో బొజ్జల సుధీర్‌రెడ్డి

ఏర్పేడు, మార్చి 30: అంజిమేడు ఎంపీటీసీ బొడుగు శ్రీనివాసులుయాదవ్, అంజిమేడు దళిత వాడుకు చెందిన 73 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కన్నలి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వీరంతా పార్టీలో చేరారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి వారందరికీ పసుపుకండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మోహన్‌రెడ్డి ఇంటివద్ద కార్యకర్తల సమావేశంలో సుధీర్‌రెడ్డి మాట్లాడారు. వైసీపీలో అసంతృప్తిగా ఉన్న నాయకులు, కార్యకర్తలను మభ్య పెట్టడానికి గతంలో పనిచేసిన తహసీల్దార్ల ఫోర్జరీ సంత కాలతో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఇంటిపట్టాలు అందిస్తున్నారని ఆరోపించారు. ఇసుక దోపిడీ, భూకబ్జాలు తప్ప అభివృద్ధి తెలియని వైసీపీని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని కోరారు. సైకిల్‌కు ఓటేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు జడ్పీటీసీ తిరుమలయ్య, శ్రీకాళహస్తి జడ్పీటీసీ వెంకటసుబ్బారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు ధనంజయలునాయుడు, మోహన్ నాయుడు, నాగరాజునాయుడు, మోహన్‌రెడ్డి, చెవిరెడ్డి గోపాల్‌రెడ్డి, శివాజీ రెడ్డి, అశ్వద్ధామ, శంకరయ్య, సాంబయ్య, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ అధిష్ఠానం ఆదేశాలు శిరసావహిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పిచ్చాటూరు, మార్చి 30: నేతలైనా, కార్యకర్తలైనా అధిష్ఠానం ఆదేశాలు శిరసా వహించాల్సిందేనని టీడీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు పాలగిరి మల్లికార్జున్‌రెడ్డి స్పష్టంచేశారు. టీడీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చాలని నియోజకవర్గంలోని కొందరు అసంతృప్తి నేతలు తిరుపతిలో మీడియాతో మాట్లాడడంపై పిచ్చాటూరులోని టీడీపీ కార్యాల యంలో క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి అధ్యక్షతన నాయకులతో, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఇందులో మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ సత్యవేడులో రెండుసార్లు టీడీపీ గెలిస్తే ఒకసారి ప్రతిపక్ష పార్టీ గెలవడం ఆనవాయితీ అన్నారు. ఆ ప్రకారం ఎవరు అవునన్నా కాదన్నా ఇక రెండుసార్లు సత్యవేడులో టీడీపీ గెలవడం ఖాయమన్నారు. నియోజకవర్గంలోని ప్రతిపల్లె, సందు తెలిసిన వ్యక్తి ఆదిమూలం అని వివరించారు. వైసీపీ ఎమ్మెల్యేగా కొన్ని పొరబాట్లు జరిగి ఉండవచ్చని సరిచేసు కుంటానని ఆదిమూలం అంటున్నా ఆయన్ను వ్యతిరేకించడం తగదని హితవు పలికారు. అందరం ఐకమత్యంగా ఎమ్మెల్యేగా ఆదిమూలాన్ని గెలిపించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి మాచర్ల రోశయ్య, నాయకులు భాస్కరన్, సెల్వ కుమార్, పద్దు రాజు, జయచంద్రనాయుడు, ఎం.ఎస్.రవి, ఏడు మండలాల నాయకులు పాల్గొన్నారు.

బాబు పర్యటన సాగిందిలా...

శ్రీకాళహస్తి, మార్చి 30: చంద్రబాబు పర్యటన శ్రీకాళహస్తిలో విజయవంతంగా సాగింది. శనివారం సాయంత్రం 5:41 నిమిషాలకి చంద్రబాబు హెలికాప్టర్ ద్వారా ఎంజీఎం ఆస్పత్రి ప్రాంగణంలో ల్యాండ్ అయ్యారు. ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, సత్రవాడ మునిరామయ్య, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు చంద్రబాబుకు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి చంద్రబాబు కాన్వాయ్‌లో రోడ్డు మార్గం ద్వారా బేరివారి మండపం వద్దకు బయలుదేరారు. సాయంత్రం 6:31గంటలకు చంద్రబాబు వేదిక పైకి విచ్చేశారు. ముందుగా స్థానిక నేతల ప్రసంగం జరిగింది. అనంతరం చంద్రబాబు నాయుడు 6:53 నిమిషాలకు ప్రసంగాన్ని ప్రారంభించారు. తొలుత తన స్నేహితుడైన బొజ్జల గోపాల కృష్ణారెడ్డి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ జనంతో మమేకమయ్యారు. 7:49 గంటల వరకు మొత్తం 56 నిమిషాల పాటు అనర్గళంగా చంద్రబాబు ప్రసంగించారు. ప్రజలకు ప్రశ్నలు వేస్తూ.. వారి నుంచి సమాధానాలు రాబడుతూ ఆయన మాట్లాడారు. సీఎం జగన్, స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ చలోక్తులు విసిరారు. 7:53 గంటలకు చంద్రబాబు వాహనం దిగారు. అక్కడి నుంచి కాన్వాయ్‌లో ఎనిమిది గంటల పది నిమిషాలకు టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు. ఆయన పర్యటన ఆద్యంతం అద్వితీయంగా జరిగింది. రాత్రి పది గంటల వరకు నాయకులు, కార్యకర్తలతో ముచ్చటించారు.

22 నుంచి శుక బ్రహ్మాశ్రమ వార్షికోత్సవాలు

శ్రీకాళహస్తి, మార్చి 30: శుకబ్రహ్మాశ్రమ ఆశ్రమ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని ముక్కటి ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు కోరారు. శుకబ్రహ్మాశ్రమంలో శనివారం విద్యా ప్రకాశానందగిరి స్వామి 26వ పుణ్య ఆరాధన మహోత్సవం, ఆశ్రమ వార్షికోత్సవాల నిర్వహణపై ఆరాధన ఉత్సవ కమిటీతో సమావేశం నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి విద్యా స్వరూపానందగిరి స్వామి, ఉత్తరాధికారి సంపూర్ణానందగిరి స్వామి, కమిటీ సభ్యులు పాల్గొని ఏర్పాట్లపై చర్చించారు. ఏప్రిల్ 22 నుంచి 26 వరకు జరిగే వార్షికోత్సవాలను నిర్వహించేందుకు అందరూ సంపూర్ణ సహకారం అందించి విజయ వంతం చేయాలని స్వామీజీలు కోరారు. వివిధ ప్రాంతాలను వస్తున్న స్వామీజీలకు వసతి, భోజనాలు తదితర వాటి గురించి చర్చించారు. ఉత్సవాల నిర్వహణకు దేవస్థానం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని ఈ సందర్భంగా చైర్మన్ తెలియజేశారు. పలు కమిటీలను ఏర్పాటు చేశారు. జనార్ధన్ రావు, రత్నంరెడ్డి, పేట జనార్ధన్, ప్రభాకర్ నాయుడు, రాజేశ్వరరావు, భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు ప్రచారంలో పాల్గొనకూడదు



సమావేశంలో మాట్లాడుతున్న బుచ్చినాయుడుకండ్రిగ తహసీల్దార్

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 30: రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని ఒకవేళ పాల్గొంటే చర్యలు తప్పవని తహసీల్దార్ మహ్మద్ ఆలీఖాన్ హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాల యంలో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో శనివారం నిర్వ హించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు, వీర్వోలు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: చౌక దుకాణ డీలర్లు ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే వేటు తప్పదని జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి రాజా రఘువీర్ హెచ్చరించారు. వరదయ్యపాళెం తహసీల్దారు కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌకదుకాణాల ద్వారా సరఫరాచేసే సరుకులలో పీఎం, సీఎం చిత్రాలుంటే వాటిని తొలగించి ప్రజలకు సరఫరా చేయాలని సూచిం చారు. డీలర్లు కానీ, వారి కుటుంబ సభ్యులు కానీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదని స్పష్టం చేశారు. సీఎస్‌డీటీ ఓబయ్య, ఆర్ఐ వేణుగోపాల్, రెవెన్యూ సిబ్బంది. డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

సత్యవేడు: రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటే చర్యలు తప్పవని తహసీల్దార్ రామాంజనేయులు హెచ్చరించారు. ఎన్నికల నియమావళి అమలుపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో రెవెన్యూ డీటీ రవిచంద్ర బాబు, సీనియర్ అసిస్టెంట్ సురేష్ పాల్గొన్నారు.